E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారీగా
విలేకరులు కావలెను వాట్సాప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: TELANGANA | సంపుటి :01 | సంచిక :162 | గురువారం 21 మే 2026 | ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ | పేజీలు: 08 | వెల :05/-

## ఇటలీ పర్యటనలో మోడీ 'స్వీట్' సర్ప్రైజ్

### మెలోనికి 'మెలోడి' చాక్లెట్ గిఫ్ట్




## ఏపీలో భగ్గుమంటున్న ఎండలు

### రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు






## నెట్ జీరో సిటీగా

# ఫ్యూచర్ సిటీ

- ఇన్వెస్ట్ తెలంగాణతో పెట్టుబడుల ఆకర్షణ
- జిల్లాల్లో డేటా సెంటర్ల ఏర్పాటుకు ప్రోత్సాహం
- ఏఐ సిటీ, హెల్త్ సిటీ పనులు వేగవంతం
- తెలంగాణలో గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు గ్రీన్ సిగ్నల్
- ఇన్వెస్టర్లకు ఎండ్-టు-ఎండ్ సేవలు
- జిల్లాల్లో ఐటీ ఉద్యోగాలకు సీఎం ప్రణాళిక
- 'ఇన్వెస్ట్ తెలంగాణ' ప్రత్యేక సొసైటీ ఏర్పాటు
- టి-ఫైబర్ వినియోగంపై సీఎం కీలక ఆదేశాలు
- ప్రపంచ స్థాయి సదుపాయాలతో ఫ్యూచర్ సిటీ
- తెలంగాణ ఇండస్ట్రియల్ గ్రోత్‌పై సీఎం సమీక్ష

హైదరాబాద్: తెలంగాణలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల ఏర్పాటుకు అంతర్జాతీయ సంస్థల నుంచి పెరుగుతున్న ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని, వాటిని హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా జిల్లాలకు కూడా విస్తరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ అవతలి ప్రాంతాల్లో కూడా జీసీసీలు, డేటా సెంటర్లు ఏర్పాటుకు అనుకూలంగా ప్రత్యేక జీసీసీ పాలసీ రూపొందించాలని సూచించారు.

ఐటీ, పరిశ్రమల శాఖలపై ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో సీఎం పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ హైవేల వెంట జీసీసీలు, డేటా సెంటర్ల ఏర్పాటు కోసం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలని సీఎం పేర్కొన్నారు. ఐటీ, ఇతర ఉద్యోగ అవకాశాలు హైదరాబాద్‌కే పరిమితం కాకుండా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు విస్తరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. "బియాండ్ కోర్ అర్బన్ రీజియన్" ప్రాంతాలను గుర్తించి అక్కడ ఐటీ, డేటా సెంటర్ల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు.

హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఇప్పటివరకు ఐటీ విస్తరణ పెద్దగా లేని ప్రాంతాల్లో కూడా డేటా సెంటర్ల ఏర్పాటు అవకాశాలను పరిశీలించాలని సీఎం సూచించారు.


ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచ స్థాయి మౌలిక వసతులతో పాటు పర్యావరణ హిత నెట్-జీరో విధానాలను తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో ప్రతిపాదిత ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఇండస్ట్రియల్ కారిడార్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఐదు ప్రాంతీయ వైద్య పర్యాటక కేంద్రాల్లో ఒకటి ఫ్యూచర్ సిటీలో భాగమైన హెల్త్ సిటీలో ఏర్పాటయ్యేలా కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరపాలని సీఎం ఆదేశించారు.

మిగతా 2లో..

## డేంజర్ బెల్స్ మోగిస్తోన్న ఎబోలా

### వేగంగా వ్యాపిస్తోన్న కొత్తరకం




**న్యూస్ డెస్క్, 20 మే (తెలుగు గళం):** డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో అరుదైన ఎబోలా వైరస్ కొత్తరకం తీవ్రకలకలం రేపుతోంది. ఈ ప్రాణాంతక వైరస్ బారిన పడి మరణించిన వారి సంఖ్య 131కి చేరింది. దీంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ.. ఎబోలా వైరస్ కొత్త స్ట్రెయిన్ ను ఇప్పటికే పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించింది.

## ఉపాధి హామీలో భారీ మార్పులు

# 7 లక్షల జాబ్ కార్డులు కట్!

**న్యూస్ డెస్క్, 20 మే (తెలుగు గళం):** కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ఉపాధి హామీ పథకం ఉద్దేశ్యం, లక్ష్యాన్ని మార్చి కొత్త పేరును తీసుకువచ్చింది. గతంలోనే కేంద్రం తీసుకొచ్చిన నిబంధనలతో ప్రతి సంవత్సరం వేల సంఖ్యలో జాబ్ కార్డులు, లక్షల సంఖ్యలో కుటుంబసభ్యులను పేర్లను అధికారులు జాబితా నుంచి తీసివేస్తున్నారు. కఠిన నిబంధనలు, తక్కువ వేతనాలు, పనులకు వెళ్లినా గిట్టుబాటు కాకపోవడం, గ్రామాలు పట్టణాలుగా మారుతుండడంతో లక్షలాది జాబ్ కార్డులు రద్దవుతున్నాయి. ఆరేండ్ల (2019-20 నుంచి 2024-25) వ్యవధిలో తెలంగాణలో ఏకంగా ఏడు లక్షలకు పైగా జాబ్ కార్డులతోపాటు 22.28 లక్షల మంది కూలీల పేర్లను జాబితా నుంచి గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు తొలగించడం గమనార్హం. 2022--23 ఆర్థిక సంవత్సరంలోనే ఏకంగా 5.10 లక్షల కార్డులను తొలగించారు. గతంలో ఎన్నడూ కూడా ఇంత పెద్ద సంఖ్యలో కార్డులను తొలగించలేదని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు చెబుతున్నారు.




## హైదరాబాద్ మెట్రో రెండో దశకు

# కేంద్రం గ్రీన్ సిగ్నల్




# కులగణనపై

## సుప్రీంకోర్టు కీలక తీర్పు




## ఎరువుల అక్రమ రవాణాపై మంత్రి సీరియస్..

### డీలర్లపై కఠిన చర్యలకు ఆదేశాలు

**న్యూస్ డెస్క్, 20 మే (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో వ్యవసాయేతర అవసరాలకు ఎరువులను అక్రమంగా తరలిస్తున్న ఘటనలపై వ్యవసాయ శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు అందాల్సిన ఎరువులు ఇతర ప్రాంతాలకు మళ్లిస్తున్నారనే సమాచారం రావడంతో వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎరువుల అక్రమ నిల్వలు, బ్లాక్ మార్కెట్ కార్యకలాపాలను అరికట్టేందుకు డీలర్లు, గోదాములపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని వ్యవసాయ శాఖ కమిషనర్‌కు మంత్రి సూచించారు. ఎరువుల కొరతను కృత్రిమంగా సృష్టించే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రైతులకు అవసరమైన సమయంలో సరిపడా ఎరువులు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని మంత్రి తెలిపారు. జిల్లాల వారీగా ఎరువుల నిల్వలను ప్రతిరోజూ పర్యవేక్షించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే అక్రమ రవాణాను అరికట్టేందుకు విజిలెన్స్ బృందాలు, ప్రత్యేక దళాల నిఘాను మరింత పెంచాలని సూచించారు. ఎరువులను పక్కదారి పట్టిస్తున్నట్లు రుజువైతే సంబంధిత డీలర్ల లైసెన్సులను రద్దు చేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని అచ్చెన్నాయుడు హెచ్చరించారు. రైతులను మోసం చేసే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. ఇక, వ్యవసాయ శాఖ అధికారుల నిర్లక్ష్యంపై కూడా విచారణ చేపట్టాలని మంత్రి ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆయన స్పష్టం చేశారు.



## హైదరాబాద్ మెట్రో రెండో దశకు కేంద్రం గ్రీన్ సిగ్నల్



**న్యూస్ డెస్క్, 20 మే (తెలుగు గళం):** హైదరాబాద్ ప్రజా రవాణా వ్యవస్థలో మరో మైలురాయిగా భావిస్తున్న మెట్రో సెకండ్ ఫేజ్ విషయంలో కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హైదరాబాద్ మెట్రో రెండో దశకు కేంద్రం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. బుధవారం కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి భేటీ అయ్యారు. ఢిల్లీలో జరిగిన ఈ సమావేశం సందర్భంగా హైదరాబాద్ లో కొనసాగుతున్న వివిధ కీలక ప్రాజెక్టులపై సమీక్ష నిర్వహించారు. నగరంలో మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, ప్రజారవాణాపై చర్చించినట్లు కిషన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టుపై చర్చ జరిగిందని మెట్రో సెకండ్ ఫేజ్ కు కేంద్ర మంత్రి సూత్రప్రాయంగా అంగీకరించారని, డీపీఆర్ అందిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఖట్టర్ చెప్పారని కిషన్ రెడ్డి తెలిపారు. కేంద్ర, రాష్ట్రాలు చెరో సగం ఖర్చుతో ముందుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. 162 కి.మీ మెట్రో రెండో దశ విస్తరణకు రాష్ట్రం నుంచి ప్రతిపాదనలు వచ్చాయని వీటిని కేంద్రం పరిశీలించి తదుపరి చర్యలు చేపడుతుందని ఖట్టర్ చెప్పారు. కాగా తెలంగాణ ప్రభుత్వం ఎల్ అండ్ టీ సంస్థ నుంచి మొదటి దశ మెట్రోను టేకోవర్ చేసిన సంగతి తెలిసిందే.

## కులగణనపై సుప్రీంకోర్టు కీలక తీర్పు



**న్యూస్ డెస్క్, 20 మే (తెలుగు గళం):** దేశంలో కులగణన ప్రక్రియపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు బుధవారం ఒక చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. జనగణనలో భాగంగా కులాల లెక్కింపును చేపట్టడానికి లైన్ క్లియర్ చేసింది. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం, వాటిని పూర్తిగా కొట్టివేస్తూ ప్రభుత్వ నిర్ణయానికి అనుకూలంగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

ఈ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. కులగణన అనేది పూర్తిగా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, ఇటువంటి పరిపాలనాపరమైన వ్యవహారాలలో న్యాయస్థానాల జోక్యం ఎంతమాత్రం ఉండబోదని స్పష్టం చేసింది. సమాజంలో వెనుకబడిన జనాభా వివరాలు, వారి సామాజిక స్థితిగతులు ఖచ్చితంగా తెలిసినప్పుడు మాత్రమే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది.

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలన్నా, వాటి సమర్థవంతమైన అమలుకైనా కులగణన అనేది ఎంతగానో ఉపయోగపడుతుందని, ఇది నేటి పరిస్థితుల్లో తప్పనిసరి అని న్యాయమూర్తి పేర్కొన్నారు. అలాగే సంక్షేమ పథకాల అమలుకు ఎంతమంది వెనుకబడిన కులాల వారున్నారో తెలుసుకోవాలని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ కీలక తీర్పుతో దేశవ్యాప్తంగా కులగణన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రభుత్వాలకు ఉన్న చట్టపరమైన అడ్డంకులన్నీ తొలగిపోయినట్లయింది.

## నెట్ జీరో సిటీగా ఫ్యూచర్ సిటీ

మొదటి పేజీ తరువాయి

అవసరమైతే ప్రధానమంత్రితో స్వయంగా మాట్లాడతానని పేర్కొన్నారు. ఫ్యూచర్ సిటీలో ప్రతిపాదిత ఏఐ సిటీ పనులను వెంటనే ప్రారంభించాలని, ప్రపంచ స్థాయి సదుపాయాలతో దీన్ని అభివృద్ధి చేయాలని సీఎం తెలిపారు. ఇండస్ట్రియల్ కారిడార్‌లో వివిధ కంపెనీల శంకుస్థాపనలకు అవసరమైన చర్యలు త్వరితగతిన చేపట్టాలని సూచించారు.

అక్కడ స్థాపించే పరిశ్రమలు నైపుణ్యాభివృద్ధి కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో ఒప్పందాలు కుదుర్చుకునేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

రాష్ట్రంలో పెట్టుబడులను మరింత ప్రోత్సహించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ప్రత్యేక సొసైటీ ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. ఇన్వెస్టర్లకు ఎండ్–టు–ఎండ్ సేవలు అందించే విధంగా ఈ సంస్థ పనిచేయాలని, ఇందులో ఐటీ, పరిశ్రమల శాఖలతో పాటు ఇంధన, ఆర్థిక శాఖల సీనియర్ అధికారులను ప్రత్యేక ఆహ్వానితులుగా చేర్చాలని సూచించారు.

పారిశ్రామికవేత్తలు హైదరాబాద్‌కు వచ్చిన నాటి నుంచి వారి కార్యకలాపాలు ప్రారంభమయ్యే వరకు అవసరమైన అన్ని సేవలను సమన్వయం చేసేందుకు ప్రత్యేక ఎస్కార్ట్ ఆఫీసర్‌ను నియమించాలని సీఎం పేర్కొన్నారు.

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మూడు నెలల్లో ప్రైవేట్ ఆపరేటర్లకు బదులుగా టి–ఫైబర్ ఇంటర్నెట్ సేవలను వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం ఆదేశించారు. గత ఆరు నెలల్లో టి–ఫైబర్‌కు మారిన ప్రభుత్వ కార్యాలయాల ద్వారా రూ.54 కోట్ల విలువైన ఆర్డర్లు వచ్చినట్లు అధికారులు సమావేశంలో వివరించారు.

ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, టీజీఐఐసీ వీసీ ఑ ఎండీ కె. శశాంక్, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దురిశెట్టి, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీలో భారీ మార్పులు..
## 7 లక్షల జాబ్ కార్డులు కట్!

మొదటి పేజీ తరువాయి




సగం మంది సభ్యులే యాక్టివ్

రాష్ట్రంలో ప్రస్తుతం 52.22 లక్షల జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో 1.07కోట్ల మంది సభ్యులుగా నమోదై ఉన్నారు. అయితే 30.59 లక్షల జాబ్ కార్డుదారుల్లోని 49.99 లక్షల మంది సభ్యులు మాత్రమే యాక్టివ్గా ఉన్నారని గ్రామీణాభివృద్ధి శాఖ ప్రకటించింది. కఠిన నిబంధనలకు తోడు ఆసక్తి లేక కొందరు, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కఠిన నిబంధనలు, షరతులతోపాటు తక్కువ వేతనాలు వస్తుండడంతో ఉపాధి హామీ పనుల కంటే వేరే పనులకు వెళ్లడం లాభమనే ఉద్దేశంతో చాలా మంది జాబ్ కార్డులను ఉపయోగించడం లేదని అధికారులు గుర్తించారు. ముఖ్యంగా ఉదయం ఒకసారి, మధ్యాహ్న భోజనం తర్వాత మరోసారి పని ప్రదేశంలో కచ్చితంగా ఫొటో తీయాలనే నిబంధన ఉపాధి పనులకు కూలీలను దూరం చేస్తున్నదనే విమర్శలు ఉన్నాయి. అంతేకాకుండా బయట పెరుగుతున్న కూలీ రేట్లకు అనుగుణంగా ఉపాధి హామీలో కూలీ రేట్లు పెరగకపోవడం మరో కారణంగా చెబుతున్నారు. వీటికి తోడు గ్రామాల నుంచి పట్టణాలకు వలసలు, కూలీలు చనిపోవడం, గ్రామాలు పట్టణాలుగా మారడం, సమీప మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో విలీనం కావడం వల్ల కూడా జాబ్ కార్డుల సంఖ్య తగ్గుతూ వస్తున్నదని అధికారులు విశ్లేషిస్తున్నారు. అంతేకాకుండా ఇన్ని నిబంధనలతో ఉపాధి పనులు చేయడం అవసరమా అనే కోణంలో కూలీలు ఆలోచిస్తూ పనికి రావడానికి ఆసక్తి చూపడం లేదు. దీంతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఉపాధి హామీ జాబ్ కార్డుల సంఖ్య తగ్గుతూ వస్తున్నది. ఫలితంగా పథకం లక్ష్యం క్రమక్రమంగా నీరుగారుతున్నది. అయితే కేంద్రం పరోక్ష లక్ష్యం మాత్రం నెరవేరుతున్నదని పలువురు ఎద్దేవా చేస్తున్నారు.

## ఇటలీ పర్యటనలో మోడీ 'స్వీట్' సర్ప్రైజ్
## మెలోనికి 'మెలోడి' చాక్లెట్ గిఫ్ట్




**న్యూస్ డెస్క్, 20 మే (తెలుగు గళం):** భారత ప్రధాని నరేంద్ర మోడీ, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనిల మధ్య ఉన్న ప్రత్యేక స్నేహ బంధం (డిప్లొమాటిక్ కెమిస్ట్రీ) గురించి ప్రపంచవ్యాప్తంగా ఎంతగా చర్చ జరుగుతుందో అందరికీ తెలిసిందే. సోషల్ మీడియా వినియోగదారులు వీరిద్దరి పేర్లను కలిపి '#Melodi' (మెలోడి) అనే హాష్ ట్యాగ్ ట్రెండ్ చేస్తుంటారు. తాజాగా వీరి స్నేహానికి సంబంధించిన మరో ఆసక్తికరమైన, ఆహ్లాదకరమైన ఉదంతం ఇరు దేశాల దౌత్య వర్గాల్లో మరియు నెట్టింట విపరీతంగా వైరల్ అవుతోంది. ద్వైపాక్షిక చర్చల నిమిత్తం ఇటలీ రాజధాని రోమ్ నగరానికి చేరుకున్న ప్రధాని నరేంద్ర మోడీ.. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనికి ఒక ఊహించని, అత్యంత ప్రత్యేకమైన కానుకను అందించారు. భారతదేశంలో దశాబ్దాలుగా ఎంతో ప్రసిద్ధి చెందిన 'పార్లేస్ మెలోడి' చాక్లెట్ ప్యాకెటు ఆయన ఆమెకు బహుమతిగా ఇచ్చారు. సోషల్ మీడియాలో తమపై నడుస్తున్న 'మెలోడి' ట్రెండ్ ను దృష్టిలో ఉంచుకునే ప్రధాని మోదీ ఈ సరదా కానుకను ఎంచుకున్నట్లు తెలుస్తోంది.

థాంక్యూ చెప్పిన మెలోని..

ప్రధాని మోడీ ఇచ్చిన ఈ స్వీట్ సర్ప్రైజ్కు జార్జియా మెలోని ఎంతగానో మురిసిపోయారు. ఈ సరదా క్షణానికి సంబంధించిన వీడియోను ఆమె స్వయంగా తన సోషల్ మీడియా ఖాతా ద్వారా పంచుకున్నారు. చాక్లెట్ ప్యాకెట్ అందుకున్న సమయంలో ఆమె ముఖంలో కనిపించిన ఆనందం నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఈ పోస్టు "థాంక్యూ ఫర్ ద గిఫ్ట్" (ఈ కానుకకు ధన్యవాదాలు) అంటూ ఆమే క్యాప్షన్ జత చేశారు. సరిగ్గా అధికారిక చర్చలు ప్రారంభం కావడానికి ముందు జరిగిన ఈ తేలికపాటి సంభాషణకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో క్షణాల్లో వైరల్గా మారింది. "ఇక దీనిపై వచ్చే మీమ్స్ ఆపడం ఎవరి తరం కాదు". "అసలైన 'మెలోడి చాక్లెట్ దొరికేసింది", "అంతర్జాతీయ దౌత్యంలో ఇదొక స్వీట్ మూమెంట్" అంటూ నెటిజన్లు రకరకాలుగా కామెంట్లు పెడుతున్నారు. గతంలో జీ7 సదస్సులో వీరిద్దరూ కలిసి దిగిన సెల్ఫీలు, చేసిన వీడియోలు సృష్టించిన సంచలనం తరహాలోనే. ఈ 'మెలోడి చాక్లెట్' ఉదంతం కూడా ఇప్పుడు ఇరు దేశాల ప్రజల మధ్య హాట్ టాపిక్గా మారింది.

## డేంజర్ బెల్స్ మోగిస్తోన్న ఎబోలా..
## వేగంగా వ్యాపిస్తోన్న కొత్తరకం

మొదటి పేజీ తరువాయి




కాంగో తూర్పు ప్రాంతంలో ఈ అరుదైన 'బుందిబుగ్యో' వేరియంట్ బారిన పడి 513 మంది వైద్యం తీసుకుంటున్నట్లు వైద్యులు చెప్తున్నారు.

అక్కడ ఈ ప్రాణాంతక వైరస్ బారిన పడిన ఒక అమెరికా పౌరుడిని అత్యవసర చికిత్స నిమిత్తం జర్మనీకి తరలిస్తున్నట్లు అమెరికా వ్యాధి నియంత్రణ, నివారణ కేంద్రం మంగళవారం ప్రకటించింది. బాధితుడిని 'సెర్జ్ క్రిస్టియన్ మిషన్' అనే సంస్థకు చెందిన మెడికల్ మిషనరీ పీటర్ స్టాఫోర్డ్‌గా గుర్తించారు. అమెరికా అధికారుల అభ్యర్థన మేరకు బెర్లిన్‌లోని ప్రముఖ 'చారిటీ యూనివర్శిటీ హాస్పిటల్' లో ఉన్న ప్రత్యేక ఐసోలేషన్ వార్డులో ఆయనకు చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జర్మనీ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ధృవీకరించింది. అత్యంత ప్రమాదకరమైన అంటువ్యాధుల నిర్వహణలో జర్మనీకి చెందిన నిపుణుల బృందం నిరంతరం పర్యవేక్షిస్తుందని అక్కడి అధికార ప్రతినిధి తెలిపారు.

అయితే.. అమెరికా విధించిన ఈ ప్రయాణ ఆంక్షలపై ఆఫ్రికా సిడిసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కేవలం సరిహద్దులను మూసివేయడం వల్ల గ్లోబల్ హెల్త్ సెక్యూరిటీని సాధించలేమని, వ్యాధి మూలాలను అణచివేయడానికి అంతర్జాతీయంగా దూకుడుగా మద్దతు ఇవ్వడమే ఏకైక మార్గమని ఆఫ్రికా సిడిసి డైరెక్టర్ జనరల్ డాక్టర్ జీన్ కసేయా అభిప్రాయపడ్డారు. ఇదిలావుండగా, ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ పరిపాలనలో యుఎస్ సిడిసి నిధులలో కోతలు విధించడం, ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ నుండి అమెరికా అధికారికంగా వైదొలగడం వంటి పరిణామాలు, ప్రస్తుత ఎబోలా సహాయక చర్యలపై, అంతర్జాతీయ సమన్వయంపై తీవ్ర ప్రభావం చూపుతాయని ప్రజారోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ఏపీలో భగ్గుమంటున్న ఎండలు
## రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు



**న్యూస్ డెస్క్, 20 మే (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్‌లో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయికి చేరుకోగా, బుధవారం కూడా పలుచోట్ల 45 నుంచి 47 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. మంగళవారం పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో అత్యధికంగా 45.6డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నెల్లూరు జిల్లా గూడూరులో 44.9డిగ్రీల కృష్ణా జిల్లా కంకిపాడులో 44.5డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, మార్కాపురం జిల్లా పెదచెర్లోపల్లి, ప్రకాశం జిల్లా సంతనూతలపాడు, బాపట్ల జిల్లా ఇంకొల్లు, ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల తదితర ప్రాంతాల్లో కూడా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాష్ట్రంలోని 28 జిల్లాల్లో 23 జిల్లాల పరిధిలోని మొత్తం 233 మండలాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో 26 మండలాలు, నెల్లూరులో 25, ప్రకాశం జిల్లాలో 23, మార్కాపురం జిల్లాలో 20 మండలాల్లో తీవ్ర ఎండలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

ఇక, ఈ రోజు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో 45 నుంచి 47డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే నెల్లూరు, కర్నూలు, నంద్యాల, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 43 నుంచి 44డిగ్రీల వరకు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాల్లో 41 నుంచి 43డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు.

## తెలుగువారి ధైర్యసాహసాలకు, ఆత్మగౌరవానికి
## ప్రతీక టంగుటూరి : సీఎం చంద్రబాబు



**న్యూస్ డెస్క్, 20 మే (తెలుగు గళం):** దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుల్లో ఒకరు, ఆంధ్రరాష్ట్రానికి తొలి ముఖ్యమంత్రిగా పనిచేసిన టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి నారాలోకేష్ ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. "తెలుగువారి ధైర్యసాహసాలకు, ఆత్మగౌరవానికి ప్రతీక టంగుటూరి ప్రకాశం పంతులు. అచంచల దేశభక్తి, నిజాయితీ, నిబద్ధతలతో ప్రజల కోసమే జీవించిన మహనీయుడు ఆయన. ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా ఆ మహోన్నత నాయకుడి సేవలను స్మరించుకుందాం." అని సీఎం చంద్రబాబు నాయుడు ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

"ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నాను. దేశం కోసం జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి టంగుటూరి ప్రకాశం పంతులు. ధైర్య సాహసాలు, ప్రజాసేవ, దేశభక్తికి ఆయన ప్రతీకగా నిలిచారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి రాష్ట్ర నిర్మాణం వరకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. టంగుటూరి ప్రకాశం పంతులు ఆశయ సాధనకు అందరం పునరంకితం అవుదాం." అని మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా ప్రజలను కోరారు.

## మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు 'మెయిన్‌హర్ట్' బ్రేక్



**న్యూస్ డెస్క్, 20 మే (తెలుగు గళం):** సీఎం రేవంత్ రెడ్డి మానస పుత్రిక మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు డీపీఆర్ తయారు చేసే పనులు నత్తనడకన సాగుతున్నాయి. డీపీఆర్ రూపకల్పనకు నియమించిన కాంట్రాక్టు ఏజెన్సీ మెయిన్‌హర్ట్ మొండికేసింది. అధికారులకు అందుబాటులో లేకుండా పనులు చేయడానికి ముందుకు రావడం లేదనే విమర్శలు లేకపోలేదు. అయితే మూసీ పునరుజ్జీన ప్రాజెక్టుకు డీపీఆర్ తయారు చేయడానికి మెయిన్‌హర్ట్ ఏజెన్సీతో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఆర్డీసీఎల్) 4 డిసెంబర్ 2024న ఒప్పందం చేసుకున్న విషయం తెలిసిందే. డీపీఆర్ తయారు చేయడానికి 18 నెలలపాటు సమయం పడుతుందని ఒప్పందంలో రాసుకున్నారు.

అయితే జూన్ 4వ తేదీతో 18 నెలలు పూర్తి కానుంది. కానీ మూసీ ప్రాజెక్టుకు సంబంధించిన 55 కిలోమీటర్లకు డీపీఆర్ ఇంత వరకు పూర్తికాలేదని అధికారులు చెబుతున్నారు. దీంతో సీఎం రేవంత్ రెడ్డికి సమాధానం చెప్పలేక, మెయిన్‌హర్ట్ ఏజెన్సీతో సకాలంలో పనులు చేయించలేక అధికారులు సతమతమవుతున్నట్లు తెలిసింది. ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తే.. 'మీరేం చేస్తున్నారు' అనే ప్రశ్న వచ్చే అవకాశముందని, ఏజెన్సీని గట్టిగా అడిగితే బిల్లులు రాలేదనే సమాధానం చెబుతున్నట్టు సమాచారం. అయితే పనులు పూర్తికాకుండానే బిల్లులెలా ఇస్తామని అధికారులు ఆపేసినట్టు తెలిసింది.

హడావుడిగా 21.కి.మీ డీపీఆర్

మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టు డీపీఆర్ రూపకల్పనలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న మెయిన్‌హర్ట్ ఏజెన్సీ మొదటి 21 కి.మీ డీపీఆర్‌ను సైతం అధికారుల ఒత్తిడి మేరకు హడావుడిగానే అందజేసిందనే విమర్శలూ లేకపోలేదు. ప్రజాప్రతినిధులు, నిపుణులు, పౌర సంఘాలు, పార్టీ ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి ఏర్పాటు చేసిన 'మూసీ ఇన్నైటీస్' కోసం ఏజెన్సీ వెంటపడితే తప్ప డీపీఆర్ ఇవ్వలేదని తెలిసింది. మూసీ పునరుజ్జీవనం ప్రాజెక్టులో మొదటి దశలో చేపట్టనున్న 21 కిలోమీటర్ల ప్రాజెక్టుకు భూసేకరణ ఖర్చు కాకుండానే రూ.6,500 కోట్ల నుంచి రూ.7వేల కోట్ల వరకు ఖర్చు అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది.

ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 11.8కి.మీ, హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు 9.2 కి.మీ మార్గాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే హిమాయత్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు అభివృద్ధి భూసేకరణ, హిమాయత్ సాగర్ బండ్ బలోపేతం, ఎకో ప్రాజెక్టు పనులను చేపట్టనున్నారు. ఉస్మాన్ సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు విస్తరణ, రక్షణశాఖకు సంబంధించిన భూములను సేకరించే కార్యక్రమాలపై ప్రభుత్వం ఫోకస్ పెట్టాలని నిర్ణయించింది.

మూసీ హద్దుల గుర్తింపు

హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని 14 మండలాల పరిధిలో గండిపేట్ నుంచి గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మార్గంలో మూసీ ప్రవహిస్తోంది. ఈ 55 కిలోమీటర్ల మార్గంలో నదికి సంబంధించిన హద్దులు గుర్తించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగానే మొదటి దశ 21 కి.మీ మార్గంలో ఇప్పటికే నాలుగు కిలోమీటర్ల మేర హద్దులను గుర్తించినట్టు అధికారులు చెబుతున్నారు. మూసీ బౌండ్రీ నుంచి ఇరువైపుల 50 మీటర్ల బఫర్ ఏరియాను గుర్తించనున్నారు. ఈ ప్రాంతాల్లో నది జీవావరణ, అర్బన్ ల్యాండ్ స్కేపింగ్ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. మూసీ నది శుద్ధీకరణ తో పాటు, ఇరువైపులా పర్యాటక కేంద్రాలు, ఉద్యానవనాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మౌలిక సదుపాయాలను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రణలికలు రూపొందించింది.

## దంచికొడుతున్న ఎండలు..
## సీఎస్‌కు రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు



**న్యూస్ డెస్క్, 20 మే (తెలుగు గళం):** తీవ్రమైన వడ గాలులు, ఎండ తీవ్రతపై వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండనున్నందున ఆయా జిల్లాల అధికారులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు తగిన సంఖ్యలో అందుబాటులో ఉంచాలని, తాగు నీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సీఎం ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మొదలు జిల్లా ఆసుపత్రుల వరకు వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, వడదెబ్బతో ఎవరైనా ఆసుపత్రుల్లో చేరితే తగిన వైద్య సహాయం అందించాలని సీఎం ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం ప్రయాణాలు చేయకుండా ఉండాలని సీఎం సూచించారు. ఆయా జిల్లాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ కలెక్టర్లకు దిశానిర్దేశం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.

# ధర్మపురం గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ





తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ మే20

హన్మకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ధర్మపురం గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న కూలీలకు గ్రామ సర్పంచ్ రమాదేవి – రఘోత్తం రెడ్డి ఆధ్వర్యంలో రెండు వందల మందికి మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో కూలీలు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు చల్లని మజ్జిగ అందించి వారి దాహార్తిని తీర్చడంతో పాటు వేసవి వేడిమి నుంచి ఉపశమనం కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రఘోత్తం రెడ్డి మాట్లాడుతూ, కూలీల ఆరోగ్యం దృష్ట్యా ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని పేర్కొన్నారు. గ్రామ ప్రజలు, ఉపాధి హామీ కూలీలు సర్పంచ్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ గొట్టం రవి వర్మ, వార్డు సభ్యులు గొట్టం రమేష్, లావణ్య, సునీల్ కుమార్, మహాలక్ష్మి, కార్యదర్శి బి. భాస్కర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మునిగాల ప్రభాకర్, ఓరుగంటి యాదగిరి, బైరపాక బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

# మలక్ పల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

## -సర్పంచ్ గిన్నారపు లత రామస్వామి





తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ మే20

హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం మలక్ పల్లి గ్రామ సర్పంచ్ గిన్నారపు లత రామస్వామి గ్రామ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సేవాభావంతో పనిచేస్తున్నారు. సర్పంచ్‌గా ఎన్నికైన కొద్ది కాలంలోనే గ్రామ ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతూ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు. గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ సీసీ రోడ్ల నిర్మాణం, త్రాగునీటి సమస్యల పరిష్కారం, మిషన్ భగీరథ నీటి సరఫరా మెరుగుదల కోసం అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి సమస్యను పరిష్కరించాలనే లక్ష్యంతో కృషి చేస్తున్నారని స్థానికులు అభినందిస్తున్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యల సహకారంతో గ్రామానికి మరిన్ని అభివృద్ధి పనులు తీసుకురావడానికి ప్రత్యేక చొరవ చూపుతున్నారు. గ్రామంలోని ప్రతి వాడ, ప్రతి కాలనీ అభివృద్ధి చెందాలనే సంకల్పంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా అర్హుల జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గిన్నారపు లత రామస్వామి మీడియాతో మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు నిరంతరం కృషి చేస్తున్నానని అన్నారు. సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన ఆరు నెలల కాలంలోనే గ్రామంలో అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామంలో సీసీ రోడ్లు, త్రాగునీటి సమస్యల పరిష్కారం, మిషన్ భగీరథ నీటి సరఫరా మెరుగుదల వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. గ్రామంలోని ప్రతి కాలనీ అభివృద్ధి చెందేలా ప్రణాళికాబద్ధంగా పనులు చేపడుతున్నామని చెప్పారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్యల సహకారంతో గ్రామానికి మరిన్ని నిధులు తీసుకువచ్చి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యేలా కృషి చేస్తున్నామని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సహకారంతో మలక్ పల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని సర్పంచ్ గిన్నారపు లత రామస్వామి స్పష్టం చేశారు.

# ఐకేపి సెంటర్‌ను సందర్శించిన సర్పంచ్ ఎడ్ల వెంకటయ్య




తెలుగు గళం న్యూస్ జఫర్గఢ్ మే20

జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం రఘునాథ్‌పల్లి గ్రామంలోని ఐకేపి సెంటర్‌ను గ్రామ సర్పంచ్ ఎడ్ల వెంకటయ్య సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్‌లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, రైతులకు అందుతున్న సౌకర్యాలు, తేమ శాతం పరీక్షలు తదితర అంశాలను పరిశీలించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎడ్ల వెంకటయ్య మీడియాతో మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలు పాటించాలని కోరారు. ఐకేపి సెంటర్‌లో రైతులకు తాగునీరు, నీడ, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఈఓ జి. అపూర్వ, రైతులు, గ్రామస్తులు, ఐకేపి సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఐనవోలు లో దేశవ్యాప్త, మెడికల్ షాపుల బంద్

## కార్యక్రమంలో పాల్గొన్న నిర్వాహకులు

### దేశవ్యాప్తంగా 12.40 లక్షల మెడికల్ దుకాణాలు మూత,






తెలుగు గళం న్యూస్ ఐనవోలు/మే 20

హనుమకొండ జిల్లా:ఫార్మసీల ధోరణికి నిరసనగా ఆల్ ఇండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ (ఐఓసీడ్ ) ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా మెడికల్ షాపులు బంద్‌లో పాల్గొన్నాయి.

కాజీపేట మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు వరంగల్ జిల్లాలోనూ మెడికల్ షాపులు స్వచ్ఛందంగా,మూతపడ్డాయి.ఐన వోలు మండల కేంద్రంలో అసోసియేషన్ మాటకు విలువిస్తూ కోమల మెడికల్, హనుమాన్ మెడికల్, శ్రీ నిత్య మెడికల్,శ్రీ భ్రమరాంబికా మెడికల్ సహా అన్ని షాపులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొన్నాయి.దేశంలోని అన్ని రాష్ట్రాల్లో సుమారు12.40 లక్షల మెడికల్,జనరల్ స్టోర్లు ఈ బంద్‌కు మద్దతుగా షట్టర్లు మూసివేశాయి.

బంద్‌కు ముఖ్యకారణాలు:

1.నిబంధనల ఉల్లంఘన:ఆన్‌లైన్ ఫార్మసీలు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులు విక్రయిస్తున్నాయి.

2.భారీ డిస్కౌంట్లు:30% నుంచి 70% వరకు డిస్కౌంట్లతో స్థానిక మెడికల్ షాపుల వ్యాపారాన్ని దెబ్బతీస్తున్నాయి. 3.ప్రజారోగ్యానికి ముప్పు:నకిలీ,నాసిరకం మందులు సరఫరా అయ్యే ప్రమాదం ఉంది.అని ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా ఆన్‌లైన్ మందుల అమ్మకాలను ప్రభుత్వం వెంటనే నియంత్రించాలి.డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి”అని ఐఓసీడ్ డిమాండ్ చేస్తోంది.అత్యవసర సేవల కోసం ఆసుపత్రుల్లోని ఫార్మసీలు తెరిచే ఉన్నాయి. అయితే సాధారణ ప్రజలు అవసరమైన మందులను ముందుగానే తెచ్చుకోవాలని ఫార్మసిస్ట్‌లు సూచించారు.

# లిక్కర్ షాప్ యాజమాన్యం ఎక్సైజ్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి వ్యక్తి మృతి

## మృతుని కుటుంబానికి 5000 సహాయం అందించిన శివకుమార్ నాయక్ జి వి ఎస్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు



తెలుగు గళం న్యూస్ అనంతపురం మే20

కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో గత మూడు రోజుల క్రితం గుంతకల్ పట్టణంలోని లక్కీ వైన్ షాప్ వద్ద మద్యం తాగి మెట్లు దిగే సమయంలో కిందపడి తీవ్రంగా గాయపడినటువంటి రామచంద్ర నాయక్ కర్నూల్లోని ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందినట్లు సమాచారం తెలుసుకున్న శివకుమార్ నాయక్ గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు హుటాహుటిన కర్నూలుకు వెళ్లి వారి కుటుంబానికి పరామర్శించి తన వంతు సహాయంగా 5000 రూపాయలు ఆ కుటుంబానికి అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గోవిందు నాయక్, జి పి ఎస్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు మల్లికార్జున జింకల రామాంజనేయులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాబు నాయక్ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో ఫీజులను నియంత్రిస్తూ సమగ్ర చట్టం రూపొందించి, అమలు చేయాలి

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/ మే20



తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రిస్తూ సమగ్ర చట్టం రూపొందించి, పకడ్బందీగా అమలు చేయాలని రివల్యూషనరీ సోషలిస్టు వరంగల్ జిల్లా కార్యదర్శి వల్లందాస్ వల్లం దాసు కుమార్. తెలంగాణ అంబేద్కర్ సంఘం వరంగల్ జిల్లా కోకన్వీనర్ జంగిలి భాస్కర్. రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ (హైస్కూల్స్ ఒ కాలేజీ) విద్యాసంస్థల యాజమాన్యాలు సామాన్య, మధ్యతరగతి ప్రజల అమాయకత్వాన్ని, ఆశలను, ఆసరాగా చేసుకుని అడ్డు అదుపు లేకుండా, రకరకాల పేర్లతో విచ్చలవిడిగా అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యారంగాన్ని వ్యాపారమయంగా మార్చి వేస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల కోసం, ప్రైవేటు విద్యాసంస్థలు వసూలు జాయినింగ్ చేస్తూన్న ఫీజుల భారాన్ని మోయలేక ఉన్న కొద్దిపాటి ఆస్తిపాస్తులను సైతం అమ్ముకుంటూ ఆర్థికంగా, మానసికంగా చితికి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని ప్రైవేటు కార్పొరేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ నియమ నిబంధనలను తుంగలో తొక్కి అదనపు సెక్షన్లు, బ్రాంచ్ లు నెలకొల్పుకుంటున్నప్పటికీ సంబంధిత విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకుండా వారి ఫీజుల దోపిడీకి కొమ్ముకాస్తూన్నారని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీ నుండి ప్రజలను రక్షించాలని కోరారు.

# ఫిర్యాదులపై పారదర్శకంగా విచారణ నిర్వహించాలి

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్



చెన్నారావుపేట, 20 మే (తెలుగు గళం): స్టేషన్ అధికారులు పారదర్శకంగా ఫిర్యాదుల విచారణ నిర్వహించి భాదితులకు బాసటగా నిలవాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ తెలిపారు. వరంగల్ సీపీ బుధవారం ఈస్ట్ జోన్ పరిధిలోని చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ ను సందర్శించారు. చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ కు చేరుకున్న పోలీస్ కమిషనర్ ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ పోలీస్ కమిషనర్ కు మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం పోలీస్ కమిషనర్ స్టేషన్ రిసెప్షన్, ఐటీ సిబ్బంది, ఇతర పోలీస్ సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకోవడంతో పాటు స్టేషన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులతో పాటు, రౌడీ షీటర్లు, అనుమానితుల రికార్డులు, ప్రస్తుతం పెండింగ్ కేసుల రికార్డ్ లకు సీపీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ స్టేషన్ సిబ్బంది సమస్యలను అడిగి తెలుకున్నారు. చివరగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రతి కానిస్టేబుల్ గ్రామాలను సందర్శించి శాంతి భద్రతలకు సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, ప్రతి గ్రామస్తుడు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా ట్రాఫిక్ రూల్స్ పై అవగహానా కల్పించాలని,రోడ్డు ప్రమాదాల నివారణకై ముందస్తు చర్యలు తీసుకోవాలని,అక్రమ ఇసుక రవాణా, పాఠశాలల పరిసరాల్లో పోగాకు ఉత్పత్తుల విక్రయాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహారించాలని పోలీస్ కమిషనర్ అధికారులు, సిబ్బందికి తెలిపారు. ఈ తనిఖీల్లో నర్సంపేట ఏసీపీ రవీందర్ రెడ్డి, నెక్కొండ సిఐ శ్రీనివాస్, చెన్నారావుపేట, నెక్కొండ ఎస్ఐలు రాజేష్ రెడ్డి, మహేందర్ ఉన్నారు.

# నిరంతరాయ విద్యుత్ సరఫరా అందిస్తున్నాం

## అదనపు నియంత్రికలను ప్రారంభించిన ఏడిఈ



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ మే20

స్టేషన్ ఘనపూర్ బుధవారం సబ్ డివిజన్ పరిధిలోని సముద్రాల శివారు గుంటూరుపల్లి లో 25కేవిఎ సామర్థ్యం కలిగిన రెండు అదనపు విద్యుత్ నియంత్రికలను ప్రారంభించిన ఎన్పిడిసీఎల్ ఘనపూర్ ఏడిఈ పాల్వాయి రణధీర్ రెడ్డి. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందిస్తున్నామన్నారు. సముద్రాల శివారులోని గుంటూరు పల్లిలోని వినియోగదారులకు ఓవర్లోడ్ సమస్యలు లేకుండా 25కేవిఎ సామర్థ్యం కలిగిన రెండు అదనపు విద్యుత్ నియంత్రికలను శివునిపల్లి ఏఈ శివ కుమార్ తో కలిసి ప్రారంభించిన ఏడిఈ రణధీర్ రెడ్డి మాట్లాడుతూ వేసవి ఇబ్బందులను ముందునుండే పసిగట్టి ఉన్నతాధికారుల సహకారంతో, వినియోగదారులకు లోఓల్టేజ్, ఓవర్లోడ్ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం అదనపు నియంత్రికలు అమర్చడమే కాకుండా వదులుగా ఉన్న విద్యుత్ లైన్లను గుర్తించి మిడిల్ స్థంబాలను నాటించి సరఫరాలోని నష్టలను నివారించామన్నారు. విద్యుత్ సిబ్బంది పనులు నిర్వహించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు,ఎన్పిడిసీఎల్ కంపెనీపరిధిలో నూతనంగా ప్రవేశపెట్టిన 'వన్ మినిట్ రూల్' నియమాన్ని విధిగా పాటించాలన్నారు, ఒక నిమిషం ఆగి అన్ని పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం పనులు నిర్వహించాలని కోరారు, వినియోగదారులు బకాయిలు లేకుండా విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలన్నారు,ఈ కార్యక్రమంలో లైన్ ఇన్స్పెక్టర్ ఎల్.కాలురామ్, లైన్మెన్లు డి.సాయిబాబు, బి.లక్పతి, జి.సురేందర్, అన్మ్యాండ్ వర్కర్స్ డాన్ సురేష్, ప్రణయ్, వినియోగదారులు జేమ్స్ రెడ్డి, రత్నాకర్ రెడ్డి, సుధీర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పర్వతగిరిలో పోలీసుల ప్రత్యేక చొరవ

- ప్రజల భద్రతే మా లక్ష్యం
- పర్వతగిరి సీఐ బి రాజగోపాల్ ఎస్సై బి ప్రవీణ్
- ప్రైవేట్ స్కూళ్ల సాయంతో 30 ప్రమాద హెచ్చరిక బోర్డులు
- వాహనదారులు ట్రాఫిక్ నియమాలు తప్పకుండా పాటించాలి
- సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదు హెల్మెట్ పెట్టుకోవాలి
- ఫోర్ వీలర్లు తప్పకుండా సీటు బెల్టు పెట్టుకోవాలి
- మద్యం మత్తులో డ్రైవింగ్ చేయకూడదు






తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 20

వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలంలో ఆర్ అండ్ బి రోడ్లపై పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పోలీసు శాఖ వినూత్నంగా స్పందించింది.వరంగల్ పోలీస్ కమిషనర్ శ్రీ సంప్రీత్ సింగ్, ఐపీఎస్ మరియు ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్ ఆదేశాల మేరకు మండలంలోని ప్రధాన రహదారులకు ఇరువైపులా 30 ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.మామునూరు ఏసీపీ శ్రీ ఎన్. వెంకటేష్, పర్వతగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.రాజగోపాల్ సూచనలతో పర్వతగిరి ఎస్హెచ్ఓ బి.ప్రవీణ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.మండలంలోని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల సహకారంతో ఈ బోర్డులను తయారు చేయించి రోడ్డు ఇరువైపులా అమర్చారు.ఈ సందర్భంగా ఎస్హెచ్ఓ ప్రవీణ్ మాట్లాడుతూ పర్వతగిరి మండల ప్రజల భద్రతే మా ప్రధాన లక్ష్యం. వాహనదారులు వేగ నియంత్రణ పాటించాలి.రోడ్డుపై ఏర్పాటు చేసిన ప్రమాద సూచికలను గమనించి, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ క్షేమంగా ఇళ్లకు చేరుకోవాలి అని కోరారు.ప్రమాదాలు ఎక్కువగా జరిగే మలుపులు,స్కూల్ జోన్లు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఈ బోర్డులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు.



# సత్తుపల్లి నుండి ఖమ్మం 3 స్టాప్స్ డీలక్స్ సర్వీస్ లు ప్రారంభం

## వెల్లడించిన డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ



సత్తుపల్లి, ఆర్ సి,మే20(తెలుగుగళం) న్యూస్: సత్తుపల్లి నుండి ఖమ్మం ప్రతిరోజు 3 స్టాప్స్ డీలక్స్ బస్సులు నడుపుతున్నట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ తెలిపారు. బుధవారం నుండి 3 స్టాప్స్ డీలక్స్ సర్వీస్ ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయని ఆయన అన్నారు. సత్తుపల్లి నుండి ఖమ్మం డీలక్స్ బస్సులకు వీఎం బంజర, కల్లూరు, వైరా స్టాప్ లను మాత్రమే ఇవ్వడం జరిగినది అని డిపో మేనేజర్ తెలిపారు. దీనివలన సత్తుపల్లి నుండి ఖమ్మం ఖమ్మం నుండి సత్తుపల్లి ప్రయాణించే ప్రయాణికులకు సమయం ఆదా అవుతుంది అని అన్నారు. త్రీ స్టాప్స్ డీలక్స్ బస్సుల సమయపాలన వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

సత్తుపల్లి నుండి ఖమ్మం

7.00, 7.30, 8.00, 11.45, 12.15, 13.00, 16.30, 17.00, 1740 గంటలకు సత్తుపల్లిలో బయలుదేరుతాయి అని అన్నారు.

ఖమ్మం నుండి సత్తుపల్లి

9.20, 9.45, 10.15, 14.15, 14.50, 15.30, 18.40, 19.15, 20.00 గంటలకు ఖమ్మం నుండి డీలక్స్ బస్సులు బయలుదేరుతాయి అని అన్నారు. సత్తుపల్లి డిపో పరిధిలోని ప్రయాణికులు ఈ సదా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి అని సత్తుపల్లి డిపో మేనేజర్ కోరారు.

# పుష్కర భక్తుల సహాయార్థం ప్రత్యేక నియంత్రణ కేంద్రం ఏర్పాటు : జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి మహదేవపూర్

కాళేశ్వర క్షేత్రంలో రేపటి (మే 21) నుండి ప్రారంభం కానున్న సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.పుష్కరాల కాలంలో దేశ,రాష్ట్ర నలుమూలల నుండి తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు అవసరమైన సమాచారాన్ని సమగ్రంగా అందించడంతో పాటు,అత్యవసర వైద్య,రక్షణ సేవలను తక్షణమే చేరవేసేందుకు వీలుగా క్షేత్రస్థాయిలో ఒక ప్రత్యేక నియంత్రణ కేంద్రాన్ని (కంట్రోల్ రూమ్ను) ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ నియంత్రణ కేంద్రం సేవల కొరకు భక్తులు 9030632608 అనే చరవాణి (మొబైల్) సంఖ్యను సంప్రదించవచ్చని వెల్లడించారు.పుష్కర క్షేత్రంలో భక్తులకు ఏవైనా సమస్యలు తలెత్తినా, ఫిర్యాదులు ఉన్నా లేదా తక్షణ సహాయం అవసరమైనా ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే ఈ సహాయక సంఖ్యకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.ఈ కేంద్రంలో వివిధ శాఖల అధికారులు,సిబ్బంది 24 గంటల పాటు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ భక్తులకు అవసరమైన సేవలు అందిస్తారని కలెక్టర్ స్పష్టం చేశారు.పన్నెండు రోజుల పాటు అత్యంత పవిత్రంగా జరుగనున్న ఈ అంత్య పుష్కరాల మహోత్సవంలో భక్తులంతా జిల్లా యంత్రాంగానికి పూర్తి స్థాయిలో సహకరించాలని,క్షేత్ర పరిసరాలలో అధికారులు సూచించిన రక్షణ మార్గదర్శకాలను,ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ రాహుల్ శర్మ విజ్ఞప్తి చేశారు.

# ఇందిరమ్మ ఇంటికి బేస్మెంట్

## ప్రారంభించిన జమాల్పురం సర్పంచ్



తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 20

వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలం,ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజు ఆదేశాల మేరకు పర్వతగిరి మండలం జమాల్పురం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా లబ్ధిదారు జిల్లా సుమలత ఇంటికి సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ కొబ్బరికాయ కొట్టి బేస్మెంట్ పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కనుకయ్య యాదవ్ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం.ఇందిరమ్మ ఇంటికి కొబ్బరికాయ కొట్టి బేస్మెంట్ పోసే కార్యక్రమం ప్రారంభించడం సంతోషంగా ఉంది.పేదల కళ్లలో ఆనందం నింపడమే మా ప్రభుత్వ ధ్యేయం అన్నారు.తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్లు లేని గ్రామం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యతా క్రమంలో దశలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి,సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని,ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలనే సంకల్పంతో కృషి చేస్తున్నామని,ఈ సందర్భంగా సర్పంచ్ అన్నారు.

# గణపురంలో ఘనంగా మాక్ పార్లమెంట్, హెరిటేజ్ వాక్ కార్యక్రమాలు




తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి గణపురం

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా ప్రణాళికలో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా యువజన,క్రీడల శాఖ ఆధ్వర్యంలో బుధవారం గణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు,యువతకు చట్టసభల పనితీరుపై అవగాహన కల్పించేందుకు నమూనా పార్లమెంట్ (మాక్ పార్లమెంట్) కార్యక్రమాన్ని అత్యంత ఆసక్తికరంగా నిర్వహించారు.అదేవిధంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో స్థానిక సంస్కృతి,చారిత్రక కట్టడాల ప్రాశస్త్యాన్ని చాటిచెప్పేలా గణపురం ప్రధాన కేంద్రం నుండి ప్రసిద్ధ కోటగుళ్ల దేవాలయం వరకు చారిత్రక నడక (హెరిటేజ్ వాక్) కార్యక్రమాన్ని చేపట్టారు.ఈ రెండు కార్యక్రమాలకు స్థానిక యువత,క్రీడాకారుల నుండి విశేష స్పందన లభించింది.ఈ చారిత్రక నడకలో పాల్గొన్న ప్రముఖులు మాట్లాడుతూ,మన ప్రాంతంలోని ప్రాచీన కట్టడాలను,శిల్పకళా సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.ఈ వినూత్న కార్యక్రమాల్లో గణపురం ఉపసర్పంచ్ కృష్ణ,పురాతత్వ శాఖ సంచాలకులు బుజ్జీ,సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు రవీందర్,జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి చిర్రా రఘు,ఆ శాఖ సిబ్బంది ఎం.శివసాగర్ తో పాటు స్థానిక యువకులు,క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతన్న రక్తం పీలుస్తున్న మోదీ సర్కార్

## ఎరువుల ధరల పెంపుపై మాజీ మంత్రి ఎర్రబెల్లి ఫైర్...

తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 20



వరంగల్ జిల్లా:ఎరువు బస్తాపై,300 వరకు ధరలు పెంచి అన్నదాత నెత్తిన మరో భారీ భారం మోపింది కేంద్ర బీజేపీ ప్రభుత్వం అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తీవ్రంగా ఆరోపించారు.

పర్వతగిరి మండల కేంద్రంలో ఆయన విడుదల చేసిన ప్రకటనలో రైతు పంట పండించాలంటే ఎరువు కావాలి.విత్తనం కావాలి.డీజిల్ కావాలి.కానీ మోదీ పాలనలో రైతుకు అవసరమైన ప్రతిదీ రోజు రోజుకీ భారంగా మారుతోంది అని మండిపడ్డారు.ఎరువుల ధరలు పెరిగాయి,డీజిల్ ధరలు మండిపోతున్నాయి, పురుగుమందుల రేట్లు ఆకాశాన్నంటుతున్నాయి.కానీ పంటలకు మాత్రం గిట్టుబాటు ధర లేదు.పంట పండించిన రైతు అప్పుల్లో కూరుకుపోతుంటే కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు మాత్రం వేల కోట్ల మాఫీలు చేస్తోంది" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇది రైతు ప్రభుత్వం కాదు, పెట్టుబడిదారుల ప్రభుత్వం.పదేళ్ల బీజేపీ పాలనలో రైతన్నను ఆదుకోవడం పక్కనపెట్టి అతని నడ్డివిరిచే పనులే చేశారు.రైతు చెమటతో దేశం బతుకుతోంది, కానీ రైతు కన్నీళ్లతో మోదీ సర్కార్ రాజకీయాలు చేస్తోంది"అని ఎర్రబెల్లి విమర్శించారు.వెంటనే ఎరువుల ధరల పెంపు వెనక్కి తీసుకోవాలి. రైతులకు పూర్తి సబ్సిడీ ఇవ్వాలి. వ్యవసాయానికి ప్రత్యేక రక్షణ కల్పించాలి.అని రైతు కోపం మొదలైతే సింహాసనాలు కూలిపోవడం ఖాయం అని ఎర్రబెల్లి దయాకర్ రావు,హెచ్చరించారు.

# కాళేశ్వరంలో నేటి నుండే సరస్వతీ అంత్య పుష్కరాలు

## :కంచి పీఠాధిపతి తొలి పుణ్యస్నానంతో ప్రారంభం













**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి మహదేవపూర్**

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో గురువారం (మే 21) నుండి జూన్ 1వ తేదీ వరకు 12 రోజుల పాటు అత్యంత వైభవంగా జరుగనున్న సరస్వతి అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అన్ని రకాల విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశాయి. ఈ పుష్కరాల కాలంలో సుమారు 30 నుండి 40 లక్షల మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ప్రభుత్వం రూ.30.63 కోట్ల నిధులను కేటాయించి పకడ్బందీ సౌకర్యాలను కల్పించింది. పుష్కరాల తొలిరోజైన గురువారం తెల్లవారుజామున 5.43 గంటలకు కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామీజీ సరస్వతీ స్నానఘట్టం (ఘాట్) వద్ద తొలి పుణ్యస్నానం ఆచరించి ఈ అంత్య పుష్కరాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. అదే రోజు సాయంత్రం రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పుష్కర స్నానం చేయనున్నారు. ఈ 12 రోజుల పాటు ప్రతిరోజూ వివిధ ప్రముఖ పీఠాల స్వామీజీలు, మంత్రులు పుణ్యస్నానాలు ఆచరించనుండగా, ఉదయం వేళల్లో హోమాలు, సాయంత్రం తెప్పోత్సవం, పెద్ద ఎత్తున సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించనున్నారు. గత ఏడాది జరిగిన ఆది పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుత వేసవి తీవ్రత దృష్ట్యా భక్తుల కోసం స్నానఘట్టాల వద్ద చలువ పందిళ్లు, తాటి చాపలు (క్వయర్ మ్యాట్లు) పరచడంతో పాటు తగినన్ని జీవన రక్షక ఔషధాలు (ఓఆర్ఎస్ ప్యాకెట్లు) అందుబాటులో ఉంచారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.1.20 కోట్లతో ప్రత్యేక ప్రదర్శనశాలను (మ్యూజియం) ఏర్పాటు చేయగా, రూ.30 లక్షలతో ఇక్కడి నాగేంద్రస్వామి ఆలయాన్ని పునర్నిర్మించారు. భక్తుల సౌకర్యార్థం తాత్కాలిక బస్టాండ్ల నుండి ఘాట్ల వరకు 90 ఉచిత ప్రయాణ బస్సులను (షటిల్ బస్సులను) నడుపుతున్నారు. సుమారు లక్షా 70 వేల వాహనాలు వచ్చే అవకాశం ఉన్నందున 245 ఎకరాల విస్తీర్ణంలో 23 ప్రత్యేక వాహన నిలుపుదల (పార్కింగ్) కేంద్రాలను తాగునీరు, 500 మరుగుదొడ్ల వసతితో సిద్ధం చేశారు. భద్రత కోసం ఘాట్లు,ఆలయ పరిసరాలలో 200 నిఘా కెమెరాలు (సీసీ కెమెరాలు), ఎల్ఈడీ విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. భక్తుల రక్షణ కోసం 50 మంది శిక్షణ పొందిన గజ ఈతగాళ్లతో పాటు ప్రత్యేక విపత్తు స్పందన దళాలు (ఎస్డీఆర్ఎఫ్), రక్షణ పడవలు,లైఫ్ రింగులను నదీ తీరంలో నిరంతరం పహారా కోసం ఉంచారు.వైద్య సేవల కొరకు 23 జోన్లలో 300 మంది వైద్య సిబ్బందితో అత్యవసర శిబిరాలు ఏర్పాటు చేసి, అంబులెన్స్ వాహనాలను అందుబాటులో ఉంచారు. మహాదేవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రధాన రెఫరల్ ఆసుపత్రిగా మార్చారు. ఒక్షేత్ర పరిసరాల పరిశుభ్రత కోసం 300 మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించగా, సమాచార మార్పిడి కోసం కార్య నిర్వహణాధికారి కార్యాలయంలో ప్రత్యేక సమాచార కేంద్రాన్ని (మీడియా సెంటర్) ఏర్పాటు చేశారు.

# సీఎం రేవంత్ ఫోటోతో గృహప్రవేశం

## ఇందిరమ్మ ఇల్లు ఇచ్చిన ప్రభుత్వానికి లబ్ధిదారు కృతజ్ఞతలు





**తెలుగు గళం న్యూస్ ఐనవోలు/మే 20**

హన్మకొండ:ఐనవోలు మండల కేంద్రంలో ఇందిరమ్మ గృహ లబ్ధిదారు గందెపెల్లి స్వప్న,సంతోష్ ముదిరాజు దంపతులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోతో గృహప్రవేశం చేశారు.

గృహప్రవేశ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్. నాగరాజును ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా లబ్ధిదారు స్వప్న మాట్లాడుతూ"గత పది సంవత్సరాల్లో ఎన్నిసార్లు మాజీ ఎమ్మెల్యే చుట్టూ తిరిగినా ఫలితం లేకుండే.నేడు కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ అన్న, ఎమ్మెల్యే నాగరాజు అన్న పేద కుటుంబమైన నన్ను గుర్తించి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చి ఆత్మగౌరవం కాపాడారు"అని కృతజ్ఞతలు తెలిపారు.గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్లు ఉచిత కరెంట్, రేషన్ కార్డుతో సన్న బియ్యం అందుతున్నాయి.మూడు పూటలా కడుపునిండా భోజనం చేస్తున్నాం. ఉండడానికి ఇల్లు ఇచ్చి మా ఇంటి చీకటిని వెలుగులతో నింపిన కాంగ్రెస్ ప్రభుత్వానికి,నాయకులకు జన్మజన్మలా రుణపడి ఉంటాం"అని స్వప్న, సంతోష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో అయినవోలు మాజీ ఎంపిటిసి బొల్లెపల్లి మధు గౌడ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,జాతీయ ఏకలవ్య అధ్యక్షులు రాయపురం సాంబయ్య, గ్రామ సర్పంచులు, ఉపసర్పంచులు, గ్రామ పార్టీ అధ్యక్షులు,మాజీ ప్రజాప్రతినిధులు, బంధువులు పాల్గొన్నారు.

# హసన్పర్తి పోలీసులు రూ.42 వేల విలువైన ప్రభుత్వ నిషేధిత పొగాకు ఉత్పత్తులు స్వాధీనం





**తెలుగు గళం న్యూస్ హన్మకొండ మే20**

హనుమకొండ జిల్లా హసన్పర్తి మండలం అనంతసాగర్ శివారులోని ఆర్.ఆర్. హోటల్లో ప్రభుత్వ నిషేధిత గుట్కా, పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నారని వచ్చిన నమ్మదగిన సమాచారంపై ఈరోజు ఉదయం ఎస్సై సుజిత్ రెడ్డి తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు.తనిఖీల్లో నిషేధిత పొగాకు ఉత్పత్తులు లభించగా, హోటల్ యజమాని తవటం శ్యాంబాబును విచారించగా, ఆయన తన వద్ద ఉన్న సరకు హనుమకొండకు చెందిన ఉమేష్ రాజపుత్ అనే వ్యక్తి ద్వారా వచ్చినట్లు అంగీకరించారు.దీని ఆధారంగా హనుమకొండలోని ఉమేష్ రాజపుత్ నిర్వహిస్తున్న హనుమాన్ కిరణం జనరల్ స్టోర్లో కూడా తనిఖీలు నిర్వహించగా, అక్కడ భారీ మొత్తంలో ప్రభుత్వ నిషేధిత పొగాకు ఉత్పత్తులు లభించాయి.స్వాధీనం చేసుకున్న మొత్తం పొగాకు ఉత్పత్తుల విలువ సుమారు రూ.42,000గా అంచనా వేయబడింది. నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకుని, ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# దౌలత్‌నగర్‌లో ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్

## రికార్డులు తనిఖీ చేసిన వైద్యాధికారి



**తెలుగు గళం న్యూస్ పర్వతగిరి/మే 20**

వరంగల్ జిల్లా:పర్వతగిరి మండలం దౌలత్‌నగర్ గ్రామంలో జరుగుతున్న యూనివర్సల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్‌ను పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మూసా మొహమ్మద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా గర్భిణీలకు నిర్వహిస్తున్న అంచనా ఏ ఎన్ సి మొదటి పరీక్షలు,టీ.డీ టీకాల ప్రక్రియతో పాటు చిన్నారులకు వేస్తున్న1వ పెంటా,3వ పెంటా టీకాల నిర్వహణను పరిశీలించారు.టీకాల నిల్వ విధానం, రికార్డుల నమోదు, చిన్నారుల హాజరు వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఆరోగ్య సిబ్బందితో మాట్లాడుతూ "సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి. గ్రామంలోని ప్రతి గర్భిణి, ప్రతి చిన్నారి ప్రభుత్వ టీకా కార్యక్రమాన్ని పూర్తిగా వినియోగించుకునేలా అవగాహన కల్పించాలి" అని ఆదేశించారు.పిల్లలకు సమయానికి టీకాలు వేయించడం ద్వారా ప్రాణాంతక వ్యాధులను నివారించవచ్చు.గర్భిణీలు కూడా నిర్దిష్ట సమయాల్లో పరీక్షలు చేయించుకోవాలి.అని హెచ్ఈఓ మూసా మొహమ్మద్ సూచించారు.

ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# వరంగల్‌లో కత్తితో దాడి గిర్మాజీపేటలో ఘటన

**తెలుగు గళం న్యూస్ వరంగల్ మే20**

వరంగల్ నగరం గిర్మాజీపేట ప్రాంతంలో కత్తితో దాడి ఘటన చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే..గిర్మాజీపేటకు చెందిన కైఫ్ (తండ్రి ముస్తాఫ్) మరియు అతని స్నేహితుడు హరీష్ (తండ్రి యాదగిరి) వీధుల్లో మద్యం సేవిస్తూ బీరు బాటిళ్లు పగలగొడుతూ న్యూసెన్స్ సృష్టిస్తున్నారని స్థానికులు తెలిపారు. అదే ప్రాంతానికి చెందిన బూర రత్నసాగర్ (తండ్రి సూర్యనారాయణ, వయస్సు 40 సంవత్సరాలు, మున్నూరు కాపు, వ్యాపారం) వారిని మందలించారు.ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న కైఫ్ మరియు హరీష్, ఈనెల 19 రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో రత్నసాగర్ తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా గిర్మాజీపేట బొడ్రాయి సమీపంలో అతడిని వెంబడించారు. అనంతరం కత్తితో దాడి చేయడంతో రత్నసాగర్‌కు రక్తగాయాలు అయ్యాయి.గాయపడిన రత్నసాగర్ వెంటనే తన అన్న మూర్తి కిరణ్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాడు.దీంతో కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని గాయపడిన రత్నసాగర్‌ను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.చికిత్స అనంతరం బుధవారం ఆయనను డిశ్చార్జ్ చేశారు.తరువాత బాధితుడు వరంగల్ ఇంతేజారుగంజ్ పోలీసులకు సమాచారం ఇవ్వగా, ఇన్‌స్పెక్టర్ ఎం.ఏ. శుకూర్ సూచన మేరకు ఎస్సై టి. తేజ బాధితుడి ఇంటికి వెళ్లి ఫిర్యాదు స్వీకరించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

# ఎ.ఐ,లైఫ్ స్కిల్స్ పై ఉచిత శిక్షణ

మహబూబాబాద్, 20 మే (తెలుగు గళం): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎ.ఐ.)లైఫ్ స్కిల్స్ పై నాలుగు రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బి.సి. స్టడీ సర్కిల్ ఇన్ చార్జి డైరెక్టర్ మాడిశెట్టి నరసింహస్వామి నేడు ఒక ప్రకటనలో తెలిపారు. నూతన సాంకేతికతలను ప్రజలకు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్న 'మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్' అనే సంస్థతో అనుసంధానంగా జూన్ 1వ తేదీ నుండి 4వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఇంటర్మీడియెట్ ఆపై విద్యార్హతతో పాటు 18-30 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇప్పటికే సాధారణ సాంకేతిక యుగం ప్రస్తుతం ప్రత్యేకంగా ఏఐ యుగంగా రూపాంతరం చెందుతున్నదని, ప్రతీ వ్యక్తి జీవితంలో ఏఐ ముఖ్య పాత్ర సంతరించుకుంటున్నదని ఆయన తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు హనుమకొండ లష్కర్ బజారులోని బి.సి. స్టడీ సర్కిల్ లో ఈనెల 30వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. దరఖాస్తులో విద్యార్హతలు, ఫోటోతో సంప్రదించాలని మరిన్ని వివరాలకు 0870-2571192 ను సంప్రదించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

# కుట్టు మిషన్ శిక్షణా శిబిరం ప్రారంభోత్సవం లో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు



కూకట్ పల్లి, 20 మే (తెలుగు గళం): శ్రీ వాసవి కన్యకపరమేశ్వరి ట్రస్ట్, కె.పి.హెచ్.బి కాలనీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు మిషన్ శిక్షణ శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ సభ్యులు కుమారస్వామి ఆహ్వానం మేరకు కూకట్ పల్లి నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ మహిళలు స్వయం ఉపాధి సాధించి ఆర్థికంగా ఎదగడానికి ఇటువంటి ఉచిత శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న "సమర్థ్" పథకం ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పిస్తూ ఉపాధి అవకాశాలు పెంపొందిస్తున్నదని పేర్కొన్నారు. కుట్టు శిక్షణ ద్వారా మహిళలు తమ కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకోవడంతో పాటు స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగవచ్చని అన్నారు. అనంతరం శిబిరంలో శిక్షణ పొందిన మహిళలు తయారు చేసిన వివిధ రకాల దుస్తులను వడ్డేపల్లి రాజేశ్వరరావు పరిశీలించి వారి ప్రతిభ, నైపుణ్యాన్ని అభినందించారు.శిక్షణ పూర్తి చేసిన మహిళలకు సర్టిఫికెట్లు అందజేసి ప్రోత్సహించారు. మహిళలు ఆత్మవిశ్వాసంతో స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. అలాగే సమాజ సేవా కార్యక్రమాల్లో నిరంతరం ముందుండే శ్రీ వాసవి కన్నికాపరమేశ్వరి ట్రస్ట్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, ట్రస్ట్ సభ్యులు, మహిళలు మరియు డివిజన్ సీనియర్ బిజెపి నాయకులు రఘురాం, వినోద్ గౌడ్, సూరిబాబు, ప్రేమ్ స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తేనెటీగలు ప్రకృతి సంరక్షకులు

# భూమిపై జీవసూచికలు



-- ప్రపంచ తేనెటీగల దినోత్సవం, జీవవైవిధ్యం మరియు ప్రపంచ ఆహార భద్రత

-- తేనెటీగలు ఏ రోజు అంతరించిపోతాయో, ఆ రోజే ఆహార ఉత్పత్తి నిలిచిపోయి భూమిపై జీవం అంతరిస్తుంది.

-- తేనెటీగల పర్యావరణ మరియు వ్యవసాయ ప్రాముఖ్యత.

వ్యాసకర్త: రవిబాబు పిట్టల, పర్యావరణవేత్త.

**ప్రపంచవ్యాప్తంగా మే 20న జరుపుకునే ప్రపంచ తేనెటీగల దినోత్సవం, భూమిపై జీవాన్ని నిలబెట్టడంలో తేనెటీగలు మరియు ఇతర పరాగ సంపర్కాలు పోషించే అద్భుతమైన పాత్రను గుర్తుచేస్తుంది. తరచుగా కేవలం చిన్న, ఝుమ్మని శబ్దం చేసే కీటకాలుగా భావించినప్పటికీ, తేనెటీగలు ప్రపంచ పర్యావరణ వ్యవస్థలకు పునాదిరాళ్లుగా ఉన్నాయి, ఇవి జీవవైవిధ్యాన్ని పెంపొందిస్తూ మానవ మనుగడను సురక్షితం చేస్తాయి. ఈ వార్షిక దినోత్సవం కేవలం ఒక వేడుక మాత్రమే కాదు, ఇది మానవాళికి ఈ కీలకమైన జీవజాతులతో ఉన్న గాఢమైన పరస్పర ఆధారిత సంబంధాన్ని మరియు వాటి క్షీణిస్తున్న జనాభాను పునరుద్ధరించాల్సిన ఆవశ్యకతను గుర్తుచేసే ఒక తక్షణ ప్రపంచ కార్యాచరణ పిలుపు.**




సామూహిక కార్యాచరణ యొక్క సమన్వయం: "ప్రజలు మరియు గ్రహం కోసం కలిసికట్టుగా ఉందాం"

"ప్రజలు మరియు గ్రహం కోసం కలిసికట్టుగా ఉందాం" అనే 2026 సమకాలీన ఇతివృత్తం, పరాగ సంపర్కాల జనాభాను రక్షించడానికి బహుళ-రంగాల సహకారం యొక్క ఆవశ్యకతను నొక్కి చెబుతుంది. ఈ కీటకాలను సంరక్షించడానికి, వ్యక్తులు, స్థానిక సంఘాలు, రైతులు మరియు విధాన రూపకర్తలు సహజ పర్యావరణ వ్యవస్థలతో కలిసికట్టుగా పనిచేయడం అవసరం. తేనెటీగలను రక్షించడం అనేది కేవలం ఒకే కీటక జాతి సంరక్షణకు మించినది; ఇది ప్రపంచ పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి, మానవ ఆహార సరఫరా గొలుసులను స్థిరీకరించడానికి మరియు భవిష్యత్ తరాలకు పర్యావరణ సుస్థిరతను నిర్ధారించడానికి అత్యంత ఆవశ్యకమైనది.



వ్యవసాయ లంగర్లు మరియు ప్రపంచ ఆహార సరఫరా

జీవావరణంలో ఆర్థికంగా మరియు పర్యావరణపరంగా అత్యంత ముఖ్యమైన పరాగ సంపర్కాలలో తేనెటీగలు కూడా ఉన్నాయి. మానవ శాస్త్ర మరియు వ్యవసాయ గణాంకాల ప్రకారం, ప్రపంచ ఆహార ఉత్పత్తిలో దాదాపు మూడింట ఒక వంతు నేరుగా జంతు పరాగ సంపర్కంపై ఆధారపడి ఉంటుంది, ఈ ప్రక్రియలో తేనెటీగలదే ప్రధాన పాత్ర. పండ్లు, కూరగాయలు, గింజలు మరియు విత్తనాలతో సహా కీలకమైన, పోషకాలు అధికంగా ఉండే పంటలు ఈ కీటకాలు అందించే పునరుత్పత్తి సౌకర్యంపై ఎక్కువగా ఆధారపడి ఉంటాయి. కేవలం మనుగడకు మించి, తేనెటీగలు పంటల పరిమాణాత్మక దిగుబడిని మరియు గుణాత్మక లక్షణాలను గణనీయంగా మెరుగుపరుస్తాయి. పరపరాగ సంపర్కం ద్వారా, అవి మొక్కల సమూహాలలో జన్యు వైవిధ్యాన్ని పెంపొందిస్తాయి, దీని ఫలితంగా వ్యాధులు మరియు పర్యావరణ ఒత్తిళ్లను తట్టుకోగల దృఢమైన పంటలు పండుతాయి. తేనెటీగల పరాగ సంపర్క సేవలు లేకపోతే, ప్రపంచ వ్యవసాయ వ్యవస్థలు విపత్కర పతనాలను ఎదుర్కొంటాయి, దాని పర్యవసానంగా తీవ్రమైన పోషకాహార లోపాలు, విస్తృతమైన ఆహార అభద్రత మరియు అస్థిరమైన సామాజిక-ఆర్థిక అంతరాయాలు ఏర్పడతాయి.

చారిత్రక పునాదులు: మే 20 ఎందుకు?

ప్రపంచ తేనెటీగల దినోత్సవం కోసం మే 20వ తేదీని ఎంచుకోవడంలో ప్రగాఢమైన చారిత్రక మరియు శాస్త్రీయ ప్రాముఖ్యత ఉంది. ఇది ఆంటోన్ జాన్షా (1734--1773) జన్మదినోత్సవాన్ని సూచిస్తుంది. 18వ శతాబ్దానికి చెందిన స్లోవేనియన్ మార్గదర్శకుడైన జాన్షా, ఆధునిక తేనెటీగల పెంపకంలో (అపికల్చర్) విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. మానవ జోక్యం ఆధారంగా కాకుండా, తేనెటీగల సహజ ప్రవర్తనల ఆధారంగా వాటికి ప్రత్యేకమైన నిర్వహణ పద్ధతులు అవసరమని విద్యాపరంగా గుర్తించిన మొదటి వ్యక్తి ఆయనే. తేనెగూళ్ల నిర్మాణాలను పునఃరూపకల్పన చేయడం మరియు గుంపులుగా విడిపోవడంపై అనుభవపూర్వక మార్గదర్శకాలను తిరిగి రాయడం వంటి ఆయన వినూత్న పద్ధతులు, సుస్థిర తేనెటీగల పెంపక పద్ధతులకు పునాది వేశాయి. ఈ పద్ధతులే నేటికీ ఆధునిక మెలిటాలజీ (తేనెటీగల అధ్యయనం) మరియు సుస్థిర వ్యవసాయానికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయి.

మానవజనిత ముప్పులు మరియు తేనెటీగల జనాభా క్షీణత

వాటి అనివార్యమైన ఉపయోగం ఉన్నప్పటికీ, ప్రధానంగా మానవజనిత (మానవ ప్రేరిత) కారకాల వల్ల ప్రపంచవ్యాప్తంగా తేనెటీగల జనాభా అపూర్వమైన క్షీణతను ఎదుర్కొంటోంది. ఈ పర్యావరణ సంక్షోభానికి ప్రధాన కారణాలు:

వ్యవసాయ రసాయనాల తీవ్ర వినియోగం: కృత్రిమ పురుగుమందులు, కలుపుమందులు, మరియు వ్యవస్థాగత కీటకనాశకాల (నియోనికోటినాయిడ్స్ వంటివి) విస్తృత వినియోగం తేనెటీగల నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ఇది వాటి దిశానిర్దేశం, ఆహార సేకరణ సామర్థ్యాలు, మరియు పునరుత్పత్తి విజయాన్ని దెబ్బతీస్తుంది.

ఆవాసాల విచ్ఛిన్నం: వేగవంతమైన పట్టణీకరణ, పారిశ్రామికీకరణ, మరియు తీవ్రమైన అటవీ నిర్మూలన సహజ ఆహార సేకరణ ప్రదేశాలను నాశనం చేసి, తేనెటీగలకు విభిన్న పుష్ప వనరులను దూరం చేస్తున్నాయి.

మానవజనిత వాతావరణ మార్పు: మారుతున్న ప్రపంచ ఉష్ణోగ్రతలు, తేనెటీగల ఆవిర్భావానికి మరియు మొక్కల పుష్పించే చక్రాలకు మధ్య ఉన్న సున్నితమైన రుతుక్రమ సమకాలీకరణకు అంతరాయం కలిగిస్తాయి. ఇది స్థానికంగా ఆకలికి దారితీస్తుంది.

కాలుష్యం మరియు వ్యాధికారకాలు: వాయు మరియు రసాయన కాలుష్యం ఆహార సేకరణకు అవసరమైన ఘ్రాణ సంకేతాలకు ఆటంకం కలిగిస్తాయి. అదే సమయంలో, ప్రపంచ వాణిజ్యం అనుకోకుండా హానికరమైన మాంసాహార జాతులను మరియు తేనెగూడుకు ప్రాణాంతకమైన వ్యాధికారకాలను వ్యాప్తి చేస్తుంది.

పర్యావరణ కీలకాలు మరియు పర్యావరణ సూచికలు

పర్యావరణ దృక్కోణం నుండి, తేనెటీగలు ప్రాథమిక జీవ సూచికలుగా పనిచేస్తాయి; తేనెటీగల జనాభా ఆరోగ్యం చుట్టుపక్కల పర్యావరణ వ్యవస్థ ఆరోగ్యాన్ని నేరుగా ప్రతిబింబిస్తుంది. అవి జీవవైవిధ్య పరిరక్షణకు అత్యంత కీలకమైనవి, భూసంబంధ ఆవాసాలకు నిర్మాణాత్మక ఆధారాన్ని ఏర్పరిచే అడవి మొక్కల పునరుత్పత్తిని సులభతరం చేస్తాయి. వృక్షజాలం యొక్క విస్తరణను నిర్ధారించడం ద్వారా, తేనెటీగలు శాకాహార క్షీరదాల నుండి విత్తనాలు తినే పక్షుల వరకు ఉన్న ద్వితీయ జీవుల యొక్క విస్తారమైన వలయానికి పరోక్షంగా మద్దతు ఇస్తాయి, తద్వారా సంక్లిష్టమైన ఆహారపు గొలుసులను నిర్వహిస్తాయి. అంతేకాకుండా, సుస్థిర వ్యవసాయంలో వాటి పాత్ర కృత్రిమ జోక్యాల అవసరాన్ని తగ్గిస్తుంది, పర్యావరణ క్షీణతకు వ్యతిరేకంగా సహజ పర్యావరణ వ్యవస్థలు స్వీయ-నియంత్రణ మరియు స్థితిస్థాపకతను కొనసాగించడానికి వీలు కల్పిస్తుంది.



ఉపశమన వ్యూహాలు: పరిరక్షణకు ఒక ప్రణాళిక

పరాగ సంపర్కాల క్షీణతను తిప్పికొట్టడానికి తక్షణ, స్థానికీకరించిన మరియు వ్యవస్థాగత జోక్యాలు అవసరం. సమర్థవంతమైన పరిరక్షణ వ్యూహాలలో ఇవి ఉన్నాయి:

వృక్ష వైవిధ్యాన్ని పెంపొందించడం: తేనెటీగలకు ఏడాది పొడవునా నిరంతరాయంగా మకరందం మరియు పుప్పొడి సరఫరాను అందించడానికి, పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాలలో స్థానిక పూల మొక్కలను నాటడం.

సమగ్ర తెగుళ్ల నివారణ (ఐపీఎం)ను అమలు చేయడం: రసాయన పురుగుమందులపై ఆధారపడటాన్ని గణనీయంగా తగ్గించి, సేంద్రియ వ్యవసాయ పద్ధతుల వైపు మారడం.




సుస్థిర తేనెటీగల పెంపకానికి మద్దతు ఇవ్వడం: సుస్థిర తేనెటీగల పెంపకాన్ని మరియు జీవవైవిధ్యానికి అనుకూలమైన స్థానిక ఆర్థిక వ్యవస్థలను ప్రోత్సహించడానికి, స్థానిక, నైతిక విలువలు పాటించే తేనెటీగల పెంపకందారుల నుండి ఉత్పత్తులను కొనుగోలు చేయడం.

విధానం మరియు విద్య: సహజ వన్యప్రాణుల కారిడార్లను పరిరక్షించే కఠినమైన ప్రభుత్వ విధానాలను అమలు చేయడం మరియు పరాగ సంపర్కాలపై అవగాహనను ప్రధాన శాస్త్రీయ చర్చలలో చేర్చడం.

తేనెటీగలు మన గ్రహం యొక్క జీవశక్తికి నిశ్శబ్ద, శ్రమజీవులైన రూపశిల్పులు. మానవ ఆరోగ్యం, పోషణ మరియు పర్యావరణ స్థిరత్వం ఈ పరాగ సంపర్కాల మనుగడతో విడదీయరాని విధంగా ముడిపడి ఉన్నాయని ప్రపంచ తేనెటీగల దినోత్సవం మనకు స్పష్టంగా గుర్తు చేస్తుంది. తేనెటీగలను కాపాడటం అనేది ఒక దాతృత్వ పర్యావరణ ప్రయత్నం కాదు; అది ఆత్మరక్షణకు సంబంధించిన ఒక ప్రాథమిక చర్య. ఈ అద్భుతమైన జీవులను, వాటి ఆవాసాలను చురుకుగా పరిరక్షించడం ద్వారా, మానవాళి జీవవైవిధ్యంతో కూడిన, ఆహార భద్రత గల, మరియు పర్యావరణపరంగా నిలదొక్కుకోగల భవిష్యత్తును సాధించగలదు.

తేనెటీగలు ఏ రోజున అంతరించిపోతాయో, ఆ రోజే ఆహార ఉత్పత్తి ఆగిపోతుంది.



తేనెటీగలు ఈ భూమి నుండి ఏ రోజున కనుమరుగవుతాయో, ఆ రోజే పరపరాగ సంపర్కం ఆగిపోతుంది, మరియు ఆహార ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోతుంది. తత్ఫలితంగా, ఆహార కొరత కారణంగా భూమిపై జీవరాశి అంతరించిపోతుంది. ఇది శాస్త్రీయంగా నిరూపించబడిన వాస్తవం. అందుకే ఈ గ్రహంపై ఉన్న ప్రతి ఒక్క జీవి యొక్క విశిష్టమైన పాత్ర అత్యంత కీలకమైనది. ఇది ప్రకృతి యొక్క మౌలిక సూత్రం. మనం ఈ సూత్రాన్ని అర్థం చేసుకుని, సకల జీవులతో సామరస్యంగా సహజీవనం చేయడానికి కృషి చేద్దాం.

రవిబాబు పిట్టల,
పర్యావరణ విద్యావేత్త,
మాజీ సహాయ ఆచార్యులు,
జే.ఎన్.టీ.యూ. హెచ్, హైదరాబాద్
మరియు సంయుక్త కార్యదర్శి,
ఒరుగల్లు వన్యప్రాణి సంరక్షణ సంఘం,
తెలంగాణ.

# కిష్టారం ఓసీలో మల్టీ డిపార్ట్మెంట్ టీం సమావేశం”









సత్తుపల్లి,ఆర్ సి, మే 20(తెలుగుగళం) : సింగరేణి సత్తుపల్లి ఏరియాలోని కిష్టారం ఓసీలో బుధవారం సి సి సి సి సి మల్టీ డిపార్ట్మెంట్ టీం సమావేశం నిర్వహించారు. ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మొదటి, రెండో షిఫ్ట్‌లలో సమావేశాలు జరిగాయి.

సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ ఆదేశాల మేరకు ఉద్యోగులందరూ నాణ్యమైన బొగ్గు ఉత్పత్తి చేసి వినియోగదారులకు అందించేందుకు కృషి చేయాలని సూచించారు. రక్షణతో పాటు సమైక్యంగా, సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

2025–26 ఆర్థిక సంవత్సరంలో కిష్టారం ఓసీ నిర్దేశిత లక్ష్యాలను సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఇటువంటి సమావేశాల ద్వారా సంస్థ స్థితిగతులు, బాధ్యతలపై ఉద్యోగులకు అవగాహన పెరుగుతుందని తెలిపారు. ప్రతి ఉద్యోగి అంకితభావంతో పనిచేస్తూ నాణ్యత, ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుపై దృష్టి సారించాలని పిలుపునిచ్చారు.

అనంతరం డీజీఎం(ఐఈ) ఎన్. యోహాన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సింగరేణి ఉత్పత్తి, ఉత్పాదకత, యంత్రాల పనితీరు, ఉత్పత్తి వ్యయం, ఉద్యోగుల సంక్షేమ కార్యక్రమాలపై వివరించారు.

ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏఎల్ఎస్వీ సునీల్ వర్మ, ఎస్ఓ టు జీఎం బి. శ్రీనివాసు, ఎజీఎం(ఎఫ్‌డఏ) ఈ. బీబత్స, ప్రాజెక్ట్ ఇంజనీర్ జి. వెంకటేశ్వరరావు, డిప్యూటీ పీఎం జి. హరీష్, ఎస్ఓఎం బి. రామకృష్ణ, అడిషనల్ మేనేజర్ వల్లమల్ల బాబు, రక్షణాధికారి గోపి కిషోర్, వెల్ఫేర్ ఆఫీసర్(ఇన్‌చార్జి) కె. శ్రీనివాస్, ఐఎన్‌టీయూసీ పిట్ సెక్రటరీ బాలాజీ, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ కిషోర్ కుమార్‌తో పాటు అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# వరంగల్ మిల్స్ కాలనీలో రూ. 2 లక్షల విలువైన అక్రమ మద్యం ధ్వంసం!

తెలుగు గళం న్యూస్ వరంగల్ మే20

వరంగల్ మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసులు భారీ చర్య చేపట్టారు.గతంలో వివిధ సోదాల్లో భాగంగా స్వాధీనం చేసుకున్న సుమారు రూ. 2 లక్షల విలువైన అక్రమ మద్యాన్ని ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులు బుధవారం బహిరంగంగా ధ్వంసం చేశారు.

జేసీబీతో తొక్కించి.. నుగ్గునుగ్గు చేసి..

మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుబడిన ఈ మద్యం బాటిళ్లను ఒక చోటకు చేర్చి, జేసీబీ సహాయంతో వాటన్నింటినీ తొక్కించి పూర్తిగా నుగ్గునుగ్గు చేశారు.అధికారుల సమక్షంలో ఈ ప్రక్రియను పూర్తి చేశారు.

కఠిన చర్యలు తప్పవు–సీఐ రమేష్ హెచ్చరిక

ఈ సందర్భంగా మిల్స్ కాలనీ సీఐ రమేష్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో అక్రమ మద్యం రవాణా, నిల్వలపై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు.చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని, ఎక్కడైనా అక్రమ మద్యం నిల్వలు ఉన్నట్లు సమాచారం తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# యువ సంచలనం వైభవ్‌పై లక్నో ఓనర్

## సంజీవ్ గోయెంకా భావోద్వేగ ట్వీట్




స్పోర్ట్స్ న్యూస్, 20 మే (తెలుగు గళం): ఐపీఎల్ సీజన్ ప్లే ఆఫ్ రేసు తీవ్ర ఉత్కంఠ భరితంగా సాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం లక్నో తో జరిగిన మ్యాచులో రాజస్థాన్ రాయల్స్ జట్టు భారీ విజయం సాధించి ప్లే ఆఫ్ రేసులోకి దూసుకొచ్చింది. ఈ మ్యాచ్ అనంతరం లక్నో సూపర్ జెయింట్స్ జట్టు ఫ్రాంచైజీ అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త సంజీవ్ గోయెంకా చేసిన ఒక భావోద్వేగ ట్వీట్ ఇప్పుడు క్రీడా వర్గాల్లో అమితంగా ఆకట్టుకుంటోంది. రాజస్థాన్ జట్టులోని యువ సంచలనం, అద్భుతమైన ఆటతీరుతో రాణిస్తున్న వైభవ్ ను ఉద్దేశించి ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ప్రశంసల జల్లు కురిపించారు. ఈ ప్రపంచం ఇప్పటికే వైభవ్ లోని అద్భుతమైన ప్రతిభను చూసిందని, ఈ దేశం అతనిలో ఒక గొప్ప భవిష్యత్తును దర్శిస్తోందని గోయెంకా కొనియాడారు. చాలా చిన్న వయసులోనే అతని భుజాలపై అంతటి పెద్ద బాధ్యత పడిందని, అయితే ఆ బాధ్యతను మోయగల అత్యంత సమర్థవంతమైన భుజాలు అతనివని ఆయన పూర్తి విశ్వాసాన్ని వ్యక్తపరిచారు.

వైభవ్‌లోని అమాయకత్వాన్ని ఇలాగే కాపాడుకుంటూ, నైపుణ్యానికి నిరంతరం పదును పెడుతూనే ఉంటే రాబోయే రోజుల్లో ఈ ప్రపంచం మొత్తం అతని పాదాక్రాంతం అవుతుందని సంజీవ్ గోయెంకా అత్యంత హృద్యంగా పేర్కొన్నారు. వైభవ్‌కు ఎల్లప్పుడూ తన ప్రార్థనలు, ఆశీస్సులు, ఎనలేని ప్రేమ ఉంటాయని స్పష్టం చేశారు. సాధారణంగా ఐపీఎల్ మైదానాల్లో యజమానుల ఒత్తిడి ఎక్కువగా ఉంటుందనే విమర్శలు వచ్చే తరుణంలో, లక్నో ఓనర్ స్వయంగా ఒక యువ దేశీ ఆటగాడిని ఇంతగా వెన్నుతట్టి ప్రోత్సహించడం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ ట్వీట్ సదరు యువ క్రికెటర్ ఆత్మవిశ్వాసాన్ని మరింత రెట్టింపు చేయడమే కాకుండా, భవిష్యత్ మ్యాచుల్లో అతను మరింత స్వేచ్ఛగా రాణించడానికి దోహదపడుతుందని క్రీడా విశ్లేషకులు భావిస్తున్నారు.

# ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కూల్ వాటర్ అందించిన సర్పంచ్ సుందరి రామారావు



పెన్ పహాడ్, 20 మే (తెలుగు గళం): అన్నారం బ్రిడ్జి గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు కూల్ వాటర్ టెంట్ సౌకర్యం కల్పించిన సర్పంచ్ సుందరి రామారావు. ఎండలు ముదిరిన సందర్భంగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సౌకర్యంగా ఉండేటటువంటి బట్టలు ధరించాలని ఆరోగ్యాన్ని చక్కగా చూసుకోవాలని వాటర్ బాటిల్స్ తెచ్చుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి పొడపంగి స్వాతి ప్రసాద్, రెండో వార్డ్ నెంబర్ గర్నె వెంకన్న, మూడో వార్డు నెంబర్ నకేరకంటి భవాని, ఏఎన్ఎం లక్ష్మి, ఆశా వర్కర్ లక్కపాక జ్యోతి, ఫీల్డ్ అసిస్టెంట్ మీసాల వెంకన్న, ఉపాధి హామీ కూలీలు అంతయ్య,చుక్కమ్మ, కరుణ, నరసయ్య తదితరులు పాల్గొన్నారు

# తేలిపోయిన పాకిస్థాన్ బ్యాటర్స్..

## బంగ్లాదేశ్ చేతిలో క్లీన్ స్వీప్..!



స్పోర్ట్స్ న్యూస్, 20 మే (తెలుగు గళం): బంగ్లాదేశ్ టెస్టు క్రికెట్ చరిత్రలో మరో అద్భుత అధ్యాయాన్ని రాసుకుంది. రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో పాకిస్థాన్ ను 2–0తో వైట్‌వాష్ చేస్తూ చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. సిల్హెట్ వేదికగా జరిగిన రెండో టెస్టులో 78 పరుగుల తేడాతో ఘన విజయం సాధించిన బంగ్లాదేశ్, అన్ని విభాగాల్లోనూ పాకిస్థాన్‌ను పూర్తిగా సోమినాటే చేసింది. సిల్హెట్‌లో జరిగిన రెండో టెస్టులో బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 278 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 390 పరుగులు చేసింది. పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 232 పరుగులు చేయగా, రెండో ఇన్నింగ్స్‌లో 358 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో బంగ్లాదేశ్ 78 పరుగుల తేడాతో చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది.

మొదటి టెస్టులోనే పాకిస్థాన్‌పై తమ గడ్డపై తొలి విజయాన్ని అందుకున్న బంగ్లాదేశ్, అదే జోరును రెండో టెస్టులోనూ కొనసాగించింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో అద్భుత ప్రదర్శన కనబరిచిన టైగర్స్ జట్టు, పాకిస్థాన్‌కు ఏ దశలోనూ అవకాశమివ్వలేదు. చివరి రోజు మ్యాచ్ ఉత్కంఠభరితంగా ప్రారంభమైంది. ఓవర్‌నైట్ బ్యాటర్లు మహ్మద్ రిజ్వాన్, సాజిద్ ఖాన్ వేగంగా పరుగులు సాధిస్తూ బంగ్లాదేశ్ పై ఒత్తిడి తీసుకొచ్చారు. ఈ సమయంలో కెప్టెన్ నజముల్ హుస్సేన్ షాంటో కీలక నిర్ణయం తీసుకుని బంతిని స్పిన్నర్ తైజుల్ ఇస్లాం చేతికి అప్పగించాడు. తైజుల్ అద్భుత బౌలింగ్‌తో మ్యాచ్ ను పూర్తిగా మార్చేశాడు. వరుస వికెట్లు పడగొడుతూ పాకిస్థాన్ ఇన్నింగ్స్‌ను కుప్పకూల్చాడు. రెండో ఇన్నింగ్స్‌లో ఆరు వికెట్లు తీసిన తైజుల్, మొత్తం మ్యాచ్‌లో తొమ్మిది వికెట్లు సాధించి బంగ్లాదేశ్ విజయానికి ప్రధాన కారకుడిగా నిలిచాడు.

437 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్ జట్టు 358 పరుగులకే ఆలౌట్ అయింది. మహ్మద్ రిజ్వాన్ ఒంటరి పోరాటం చేస్తూ 94 పరుగులు సాధించినప్పటికీ జట్టును విజయానికి చేర్చలేకపోయాడు. చివర్లో సాజిద్ ఖాన్ కొంత ప్రతిఘటన చూపించినా బంగ్లాదేశ్ బౌలర్ల దూకుడును అడ్డుకోలేకపోయారు. ఈ మ్యాచ్‌లో అద్భుత బ్యాటింగ్ ప్రదర్శన కనబరిచిన బంగ్లాదేశ్ కెప్టెన్ లిట్టన్ దాస్ కు ‘ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు’ దక్కింది. తొలి ఇన్నింగ్స్‌లో 126 పరుగులు, రెండో ఇన్నింగ్స్‌లో 69 పరుగులు చేసి జట్టు విజయానికి కీలక పాత్ర పోషించాడు.

మ్యాచ్ అనంతరం లిట్టన్ దాస్ మాట్లాడుతూ.. తొలి రోజున పిచ్ చాలా కఠినంగా ఉందని, అవుట్‌ఫీల్డ్ కూడా నెమ్మదిగా ఉండటంతో పరుగులు చేయడం సవాల్‌గా మారిందని తెలిపాడు. కెప్టెన్ షాంటో ఇచ్చిన సలహాతో దూకుడుగా ఆడిన తర్వాత తన ఆట మారిందని చెప్పాడు. ఇక రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో నిలకడైన బ్యాటింగ్ ప్రదర్శన కనబరిచిన ముషఫీక్ర్ రహీమ్ కు ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు లభించింది. మొత్తం 253 పరుగులు సాధించి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు.

# చెపాక్ లో ఇషాన్ చర్యలు..

## మద్దతిస్తున్న సీనియర్



స్పోర్ట్స్ న్యూస్, 20 మే (తెలుగు గళం): సోమవారం సిఎస్కే, ఎస్ఆర్ఎచ్ మధ్య జరిగిన మ్యాచ్ అనంతరం చెలరేగిన వివాదం తీవ్ర చర్చకు దారి తీసింది. మ్యాచ్ గెలిచిన అనంతరం సన్ రైజర్స్ స్టార్ ప్లేయర్ ఇషాన్ కిషన్ చెన్నై అభిమానులను ఉద్దేశించి చేసిన చర్యలపై విమర్శలు వెల్లువెత్తాయి. అభిమానులను అలా అవమానిస్తూ ప్రవర్తించడం పట్ల నెటిజన్స్, తమిళ మీడియా అసహనం వ్యక్తం చేసింది. అయితే అనూహ్యంగా ఈ విషయంలో ఇషాన్ కిషన్ కు సీనియర్ ప్లేయర్ల మద్దతు లభిస్తోంది. సునీల్ గవాస్కర్, సెహ్వాగ్, అశ్విన్ లాంటివాళ్లు ఇషాన్ చర్యలను సమర్థిస్తున్నారు. కుర్రాళ్ళు ఆ మాత్రం అగ్రెసివ్ గా ఉండటంలో తప్పులేదు అని గవాస్కర్ వ్యాఖ్యానించగా.. సెహ్వాగ్ మాత్రం చెన్నై అభిమానులపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ ఇషాన్ ను సపోర్ట్ చేసారు. తాను తన కుమారునితో ఆ మ్యాచ్ చూడటానికి వచ్చానని, ఒక దశలో సిఎస్కేఅభిమానుల విజిల్ బ్లోయింగ్ చాలా చిరాకు తెప్పించిందని, వాళ్ళు అలా రెచ్చగొట్టడం వల్లే ఇషాన్ అలా రియాక్ట్ కావాల్సి వచ్చిందని సెహ్వాగ్ చెప్పుకొచ్చాడు.

తను ఎంత అసహనంగా ఫీల్ అయి ఉంటే అలా ప్రవర్తించి ఉంటాడో తాను అర్థం చేసుకోగలను అంటూ వెనకేసుకొచ్చాడు. ఇక మరో సీనియర్ ఆటగాడు అశ్విన్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసాడు. చెపాక్ లో మ్యాచ్ ఉన్న ప్రతిసారి అభిమానుల విజిల్ గోల ఎక్కువగా ఉంటుందని, ఇప్పటికైనా స్టేడియంలోకి విజిల్స్ బ్యాన్ చేయాలని నిర్వాహకులను కోరాడు. మొత్తానికి చెన్నై అభిమానుల పాలిట విలన్ గా మారిన ఇషాన్ ప్రవర్తనపై సీనియర్లు మద్దతు తెలుపుతుండటంతో బీసీసీఐ ఎలాంటి చర్యలు తీసుకోకుండానే వదిలేసే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. ఇక చెన్నై చెపాక్ స్టేడియంలోకి విజిల్స్ తీసుకు రావడం మీద బ్యాన్ కూడా విధించే అవకాశం ఉందని వార్తలు వినిపిస్తున్నాయి.

# ముందు ఆర్థిక స్వేచ్ఛ.. తర్వాతే పెళ్లి



మహిళలు ఎవరిని పెళ్లి చేసుకుంటారనే దానికంటే.. మీరు ఏం చేస్తారు, మీరు ఎవరనేదే ముఖ్యం అంటున్నారు బాలీవుడ్ కథానాయిక కంగనా. వివాహిత మహిళలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై ఆమె తాజాగా ఇన్‌స్టా స్టోరీలో ఒక నోట్ పంచుకున్నారు. ఇందులో యువతులు వివాహ బంధంలోకి అడుగుపెట్టే ముందు ఆర్థిక స్వాతంత్ర్యంతో పాటు తమ కెరీర్‌ను నిర్మించుకోవడంపై దృష్టి పెట్టాలని తెలిపారు. “రోజూ పెళ్లి అయిన యువతుల గురించి ఎన్నో విషాద వార్తలు వస్తున్నాయి. చదువుకున్న యువతులలో చాలా మంది ఆ విషాదం ఎదురుకాకముందే.. తమని ఉక్కిరిబిక్కిరి చేసే పరిస్థితుల నుంచి బయటపడేయమని తమ తల్లిదండ్రులను వేడుకుంటున్నారు. కానీ, భారతీయ సమాజం కూతుళ్లకు పెళ్లయ్యాక వారిని వదిలేస్తుంది. మీ జీవితంలో మరెవరోకన్నా మీ కెరీరే మీకు ముఖ్యం. మీరు ఆర్థికంగా స్వేచ్ఛగా ఉన్న తర్వాతే పెళ్లి గురించి ఆలోచించండి. దయచేసి, మీ జీవితానికి మీరే హీరో అయి ఉండండి. మిమ్మల్ని కాపాడటానికి ఎవరూ రారు. మీరు ఎవరిని పెళ్లి చేసుకుంటారనే దానికంటే మీరు ఏం చేస్తున్నారు, ఎవరు అనేదే ముఖ్యం. మీకు కావాల్సిన జీవితాన్ని మీరే నిర్మించుకోండి. ఎవరి మాటా వినకండి” అని కంగనా ఆ నోట్‌లో పేర్కొన్నారు. ఉత్తరాదిలో ఇటీవల జరిగిన వివాహిత మహిళల ఆత్మహత్యల నేపథ్యంలో కంగనా ఈ పోస్ట్ పెట్టినట్లు సామాజిక మాధ్యమాల్లో చర్చనీ యాంశమైంది. కంగనా నటిస్తున్న ‘భారత భాగ్య విధాత’ వచ్చే నెల 12న విడుదల కానుంది.



# సోషల్ మీడియాకు రియా చక్రవర్తి బ్రేక్..

బాలీవుడ్ వివాదాస్పద నటి రియా చక్రవర్తి మరోసారి వార్తల్లో నిలిచారు. దివంగత నటుడు, తన మాజీ ప్రియుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణం తర్వాత ఎదుర్కొన్న లీగల్ కేసులు, అరెస్టులు, తీవ్రమైన సోషల్ మీడియా ట్రోలింగ్స్ నుండి కోలుకుని.. ఇప్పుడిప్పుడే కెరీర్‌పై ఫోకస్ పెడుతున్న రియా, సడన్‌గా ఒక షాకింగ్ నిర్ణయం తీసుకున్నారు. కొంతకాలం పాటు సోషల్ మీడియాకు పూర్తిగా బ్రేక్ ఇస్తున్నట్లు ఆమె ప్రకటించారు.

‘ఈ మధ్య కాలంలో నన్ను నేను కాస్త మిస్ అవుతున్నట్లు అనిపిస్తోంది. సోషల్ మీడియాలోని నిరంతర శబ్దం, స్క్రోలింగ్, ఆన్‌లైన్ ప్రపంచంతో పోటీ పడటం.. ఇవన్నీ నేను ఊహించిన దానికంటే ఎక్కువ భారంగా అనిపిస్తున్నాయి. ప్రతి క్షణాన్ని కెమెరాలో బంధించాలనే ఆలోచన లేకుండా ప్రశాంతంగా గడపాలి. అందుకే కాస్త సోషల్ మీడియా నుండి ఒక అడుగు వెనక్కి వేస్తున్నాను. ప్రస్తుతానికి వర్చువల్ లైఫ్ కంటే నిజ జీవితంలో గడిపే క్షణాలకే నా మొదటి ప్రాధాన్యత. త్వరలోనే మళ్లీ కలుద్దాం’ అంటూ తెలిపింది.

# ఓటీటీలోకి ఎంట్రీ ఇచ్చిన ‘సతీ లీలావతి’!




రీసెంట్‌గా విడుదలైన టాలీవుడ్ చిత్రాల్లో మెగా కోడలు లావణ్య త్రిపాఠి కొణిదెల హీరోయిన్‌గా నటించిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ‘సతీ లీలావతి’ కూడా ఒకటి. దేవ్ మోహన్ హీరోగా నటించిన ఈ చిత్రాన్ని ‘భీమిలి కబడ్డీ జట్టు’ ఫేమ్ దర్శకుడు తాతినేని సత్య తెరకెక్కించారు. మంచి అంచనాల మధ్య ఈ సినిమా థియేటర్లలో విడుదలైంది. అయితే సమ్మర్ సీజన్‌లో థియేటర్ల వద్ద కొనసాగుతున్న డ్రై పీరియడ్ కారణంగా ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో స్పందనను అందుకోలేకపోయింది. ఫ్యామిలీ ఆడియన్స్‌ను టార్గెట్ చేస్తూ వచ్చిన ఈ రొమ్‌కామ్ చిత్రం ప్రేక్షకులను పెద్దగా ఆకట్టుకోలేకపోయినప్పటికీ, ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది.

థియేటర్లలో విడుదలైన కేవలం రెండు వారాల్లోనే ‘సతీ లీలావతి’ డిజిటల్ స్ట్రీమింగ్‌లోకి వచ్చేసింది. ఈ సినిమా ఓటీటీ హక్కులను ప్రముఖ ప్లాట్‌ఫామ్ సన్ నెక్స్ట్ సొంతం చేసుకోగా, ఇవాళ్టి నుంచే స్ట్రీమింగ్ ప్రారంభమైంది. థియేటర్లలో మిస్ అయిన వారు ఇప్పుడు ఇంటి వద్దే ఈ సినిమాను వీక్షించవచ్చు.ఇక ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ సంగీతం అందించగా, నాగ మోహన్ బాబు నిర్మాణ బాధ్యతలు చేపట్టారు.




# ‘ధురంధర్ 2’ దేశ భద్రతకు ముప్పా? కేంద్రానికి హై కోర్టు కీలక ఆదేశాలు..

ప్రపంచవ్యాప్తంగా విజయవంతమైన “ధురంధర్ 2” సినిమా ఇప్పుడు వివాదంలో చిక్కుకుంది. సైన్యానికి సంబంధించిన కీలక ఆపరేషన్ వివరాలను సినిమాలో బహిర్గతం చేశారంటూ సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బి) హెడ్ కానిస్టేబుల్ దీపక్ కుమార్ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన హైకోర్టు, దేశ భద్రతకు ముప్పు కలిగించే అంశాలు సినిమాలో ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వం, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ)ను ఆదేశించింది. సినిమాలోని కొన్ని పాత్రలు ఉన్నతాధికారులు, మరణించిన సైనికులను పోలి ఉన్నాయని పిటిషనర్ ఆరోపించారు. అధికార రహస్యాల చట్టం ఉల్లంఘన జరిగిందా అనే అంశంపై విచారణ చేపట్టాలని ధర్మాసనం సూచించింది.

# చిరు 158 కి థమన్ ఫిక్స్..




మెగాస్టార్ చిరంజీవి, బ్లాక్‌బస్టర్ దర్శకుడు బాబీ కొల్లి (కొల్లి సురేష్) కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ చిరు 158. ‘వాల్తేరు వీరయ్య’ వంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత వీరిద్దరి కలయికలో వస్తున్న సినిమా కావడంతో మెగా అభిమానుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కాగా మెగాస్టార్ చిరంజీవి తన 158వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ భారీ కమర్షియల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ను లీడింగ్ ప్రొడక్షన్ హౌస్ నిర్మిస్తోంది. ఈ సినిమా కోసం మెగాస్టార్ చిరంజీవి సరికొత్త మేకోవర్‌తో, ఊహించని రేంజ్ డెడికేషన్‌తో వర్క్ చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రానికి సంబంధించి మేకర్స్ రోజుకో సాలిడ్ అప్‌డేట్‌తో సోషల్ మీడియాలో రచ్చ లేపుతున్నారు. నిన్ననే ఈ చిత్రానికి సంబంధించిన ప్రొడక్షన్ డిజైనర్ వివరాలను వెల్లడించిన చిత్ర యూనిట్.. తాజాగా ఈ మెగా ప్రాజెక్ట్‌కు మ్యూజిక్ అందించబోయే ఆ ‘టాప్ మ్యూజిక్ డైరెక్టర్’ ఎవరనేది అధికారికంగా ప్రకటించింది. తాజాగా ఈ సినిమాకు టాలీవుడ్ మోస్ట్ బిజీయెస్ట్ అండ్ స్టార్ మ్యూజిక్ సెన్సేషన్, ఎస్.ఎస్. థమన్ సంగీత దర్శకుడిగా ఎంపికైనట్లు మేకర్స్ అఫీషియల్ అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. థమన్ రాకతో చిరు 158 ప్రాజెక్ట్‌కు మ్యూజికల్ గా అప్పుడే భారీ హైప్ వచ్చేసింది. బాబీ మార్క్ మాస్ ఎలివేషన్లకు, థమన్ మార్క్ ఇంటెన్స్ డ్రమ్స్ అండ్ బీజీఎమ్ తోడైతే థియేటర్లలో రచ్చ ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ మరియు పాటల రికార్డింగ్ పనులు ప్రారంభం కానున్నాయని ఇండస్ట్రీ టాక్.

# చేస్తే అలాంటి సినిమాలే చేయాలి..

సౌత్ సినీ పరిశ్రమలో ప్రస్తుతం మమితా బైజు పేరు ఒక బ్రాండ్‌గా మారుతోంది. గ్లామర్ పాత్రల కంటే కూడా పర్ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న క్యారెక్టర్స్ ఎంచుకుంటూ స్టార్ హీరోల సరసన ల్యాండ్ అవుతోంది. రాబోయే రోజుల్లో విడుదల కానున్న ఆమె లైనప్ చూస్తే.. సౌత్ బాక్సాఫీస్ వద్ద ఈమె రేంజ్ మరింత పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆమె తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం, తన కెరీర్, ఫ్యాన్స్, ఫ్యూచర్ ప్లాన్స్ గురించి మమితా బైజు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది

‘నా అభిమానుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే విభిన్నమైన చిత్రాలను చేయాలన్నదే నా ఏకైక లక్ష్యం. సినిమాల ద్వారా ఒక మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకోవాలని కోరుకుంటున్నాను. నా కెరీర్ ముగిసిన తర్వాత లేదా భవిష్యత్తులో ఎప్పుడైనా నా గతాన్ని, నేను ప్రయాణించిన కాలాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే.. నా ముఖంలో ఒక తెలియని ఆనందం, తృప్తి కలగాలి. అందుకోసమే నేను కథల ఎంపికలో ఇంత జాగ్రత్తగా ఉంటూ నా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాను’ అని చెప్పుకొచ్చింది.

ఇక రాబోయే కొద్ది నెలల్లో ఆమె నటించిన మూడు క్రేజీ సినిమాలు.. జననాయకన్ (తెలుగులో ‘జన నాయకుడు’), విశ్వనాథ్ అండ్ సన్స్, ఇరండు విధానం.. వంటి మమితా బైజు నటించిన బ్యాక్-టు-బ్యాక్ థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ మూడు సినిమాలు కనుక బాక్సాఫీస్ వద్ద అనుకున్న రేంజ్‌లో క్లిక్ అయితే.. సౌత్ ఇండియాలోనే టాప్ లీగ్ హీరోయిన్ల జాబితాలోకి మమితా చేరడం ఖాయం.



Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.